ప్రజాశక్తి

సోమవారం 28 ఆగస్టు 2023 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

దొంగ ఓట్లు తొలగిస్తే

టిడిపికి నష్టమేంటి?

సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున

మాట్లాడుతున్న మంత్రి నాగార్జున

ప్రజాశక్తి - భట్టిప్రోలు (వేమూరు)

దొంగ ఓట్లను తొలగిస్తే టిడిపికి నష్టం ఏమిటని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మెరుగు నాగార్జున ప్రశ్నించారు. వేమూరులో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడా దొంగ ఓటు ఉండటానికి వీలు లేదన్నారు. దొంగ ఓటు ఎక్కడ ఉన్నా తొలగిస్తామన్నారు. నిజాయతీగా ఓటు లేకపోతే ఓటు హక్కు కల్పిస్తామన్నారు. ఎన్నికలు ప్రజాస్వామ్య బద్ధంగా జరగాలంటే దొంగ ఓట్లు తొలగించాల్సిందేనని ఆయన తెలిపారు. అందుకే స్థానికసంస్థల ఎన్నికలలో నిజాయతీగా గెలిచామని తెలిపారు. తమ నాయకుడు సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రజా స్వామ్యబద్ధంగా పరిపాలన కొన సాగిస్తున్నారని తెలిపారు. ఎక్కడా వెన్ను పోటు పొడిచి అధికారంలోకి రాలేదని చంద్రబాబు నుద్దేశించి అన్నారు. దొంగ ఓట్ల తొలగిస్తే చంద్రబాబు, ఆనందబాబు ఎందుకు భయ పడుతున్నారని ఆయన ప్రశ్నించారు. రాజ్యాంగ బద్ధంగా పేదవాడికైనా, కోటీశ్వరుడు కైనా ఒకే ఓటు ఉంటుందని తెలిపారు. అలాంటిది దొంగ ఓట్లు తొలగిస్తే ఫిర్యాదు చేస్తారా? ఎవరి మీద ఎవరు చేస్తారు? అని ఆయన ప్రశ్నించారు. దొంగ ఓట్ల తొలగింపు కోసం ఈ నెల 28న తాము ఎన్నికల కమిషన్‌ను కలుస్తామని ఆయన తెలిపారు.

ప్రత్యామ్నాయ

విద్యావిధానాల కోసం కృషి చేయాలి

యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో వక్తల పిలుపు

సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్. లక్ష్మణరావు

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

శాస్త్రీయ చరిత్ర, ప్రత్యామ్నాయ విద్యా విధానాల అమలు కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాల సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. యుటిఎఫ్ రాష్ట్ర మధ్యంతర కౌన్సిల్ సమావేశాలు ఒంగోలు నగరంలో ఆది, సోమవారాల్లో జరగనున్నాయి. ఈ సమావేశాలను ఎన్‌టిఆర్ కళాక్షేత్రంలో విఠపు బాలసుబ్రహ్మణ్యం ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. ప్రపంచ చరిత్రలో మానవజాతి పరస్పర సహకారంతోనే అభివృద్ధి చెందిందని వివరించారు. సమిష్టి కృషి ద్వారా సంపద సృష్టించడం మానవజాతి ప్రత్యేకతని, కులం, మతం, ప్రాంతాల విభేదాలతో ఉన్న దేశాల అభివృద్ధి కుంటుపడుతోందని అనేక అనుభవాలు తెలిపాయని చెప్పారు. చంద్రయాన్-3 విజయవంతం వెనుక దేశ శాస్త్రవేత్తలతోపాటు ఇతర దేశాల 1960 నుంచి కృషి, వైఫల్యం కూడా దాగి ఉందని వివరించారు. మానవ జాతి పరిణామ క్రమంలో మానవ రూపానికి రావడానికి దారితీసిన పరిణామక్రమం అధ్యయనం చేసిన డార్విన్ పరిణామ సిద్ధాంతం నేటికీ శాస్త్రీయ సిద్ధాంతం అని తెలిపారు. డార్విన్ పరిణామ సిద్ధాంతాన్ని పాఠ్యాంశాల నుంచి తొలగించడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠ్యాంశాలు అన్నింటిలోనూచరిత్రలో నిరూపించిన వైజ్ఞానిక అంశాలు ఉండేటట్లు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు.

ఎమ్మెల్యే ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యారంగంలో జరుగుతున్న మార్పులను ఉపాధ్యాయులు లోతుగా అధ్యయనం చేయాలన్నారు. పాఠ్యాంశాలలోని అశాస్త్రీయ అంశాల తొలగింపు కోసం పోరాటం చేయాలన్నారు. యుటిఎఫ్ స్థాపించి 50 సంవత్సరాలు అయ్యిందని, ఈ కాలంలో విద్యారంగంలో అనేక విజయాలు ఉపాధ్యాయులకు యుటిఎఫ్ సాధించి పెట్టిందని గుర్తు చేశారు.కౌన్సిల్ సమావేశాల ప్రారంభానికి ముందు ఎస్‌టిఎఫ్ఐ, యుటిఎఫ్ జెండాలను ఆవిష్కరించారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ కార్యదర్శి రిపోర్టును ప్రవేశపెడుతూ విద్యారంగంలో విద్యార్థులకు నాణ్యమైన విద్య రావడం కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలని

▶ 2లో

కరువు సహాయక చర్యలు చేపట్టాలి

సిపిఎం జిల్లా ప్లీనరీ సమావేశం డిమాండ్

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితుల నుంచి రైతులు, వ్యవసాయ కూలీలను కాపాడేందుకు తక్షణం సహాయక చర్యలు చేపట్టాలని సిపిఎం జిల్లా ప్లీనరీ సమావేశం డిమాండ్ చేసింది. జిల్లా ప్లీనరీ సమావేశం రాష్ట్ర కమిటీసభ్యులు పూనాటి ఆంజనేయులు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్రకార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రసంగించారు. సమా వేశంలో చేసిన తీర్మానాలను జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ వెల్లడించారు. జిల్లాలో కరువు పరిస్థితులను అధ్యయనం చేయాలని సమావేశం సూచిం చింది. కరువు వల్ల ఖరీఫ్ పంటల సాగు ఆగిపోయిందని, నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, తాగునీటి ఎద్దడి లేకుండా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని, తాగునీటి పతకాల మరమ్మతులు చేపట్టాలని, నీటిని సరఫరా చేసిన వారికి బిల్లులు సకాలంలో చెల్లించాలని సమావేశం తీర్మానించింది. సాగర్ జలాలను వెంటనే విడుదల చేయాలని, విద్యుత్ కోతల కారణంగా పరిశ్రమలు, వ్యవసాయం, గృహ వినియోగదారులు ఇబ్బందులు పడు తున్నారని, తక్షణం విద్యుత్ కోతల నివారణకు చర్యలు తీసుకోవాలని తీర్మానించింది. జిల్లాలో మహిళలు, విద్యార్థినులపై వేధింపులు, అత్యాచారాలు, హత్యలు, ఇటీవల కాలంలో పెరిగాయని సమావేశంలో చర్చకు వచ్చింది. ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించిన వార్డు గ్రామ మహిళా పోలీస్‌వ్యవస్థ, దిశచట్టం వచ్చాక కూడా మహిళలపై హింస పెరగడం ఆందోళనకరంగా ఉందని సిపిఎం జిల్లా ప్లీనరీ అభిప్రాయ పడింది.దళితులు, గిరిజనులు, బలహీనుల పైనా దాడులు పెరిగాయని, హైటెక్ యుగంలోనూ కుల అహంకారం కారణంగా దాడులు జరుగుతున్నాయని, వీటిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని సమావేశం తీర్మా నించింది. పాఠశాలల విలీనం వల్ల విద్యావ్యవస్థ గందరగోళంలో పడిందని, ప్రాథమిక పాఠశాలలు ఇపుడు అయోమ యంలో పడ్డాయని సమావేశంలో చర్చ సాగింది. ప్రాథమిక పాఠశాలల బలహీనపడినందున క్రమంగా తల్లిదండ్రులు కూడా ప్రైవేటు పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారని, ఫలితంగా ఉపాధ్యాయులు మిగులు తేలుతున్నారని, ఆ పోస్టులను రద్దుచేసే దిశగానే అడుగులు వేస్తున్నారని సమావేశం అభిప్రాయ పడింది ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జివి. కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, షేక్‌మాబు, చీకటి శ్రీనివాసరావు, ఎం.రమేష్, డి.సోమయ్య, ఊసా వెంకటేశ్వర్లు, వెల్లంపల్లి ఆంజనేయులు పాల్గొన్నారు.

నల్ల దుస్తులు ధరించి నిరసన తెలుపుతున్న నాయకులు

భూములు ఇచ్చేది లేదు

- వాన్‌పిక్ వ్యతిరేక పోరాట కమిటీ
- నిమ్మగడ్డ ప్రసాద్ రహస్య పర్యటన పట్ల నిరసన

ప్రజాశక్తి - వేటపాలెం

నిమ్మగడ్డ ప్రసాద్ వాన్‌పిక్ భూముల్లో రహస్యంగా పర్యటిస్తే ఊరుకొనేది లేదని వాన్‌పిక్ వ్యతిరేక పోరాట కమిటీ కార్యదర్శి పి.కొండయ్య, మోటుపల్లి పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ పండు రాజు శంకర్ హెచ్చరించారు. వాన్‌పిక్ చైర్మన్ నిమ్మగడ్డ ప్రసాద్ రహ్యాసంగా వాన్‌పిక్ భూముల్లో పర్యటించడాన్ని వ్యతిరేకిస్తూ స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో నల్ల దుస్తులతో ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల దగ్గర వాన్‌పిక్ కోసం సేకరించిన భూములను తిరిగి రైతులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు, వాన్‌పిక్ ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానం నెరవేరలేదన్నారు. ఇంటికో ఉద్యోగం నివాస స్థలం, ఇల్లు, పాడి గేదెలు అంటూ అరచేతిలో వైకుంఠం చూపారని దుయ్యబట్టారు. తక్కువ ధరలకే రైతుల భూములు కాజేశారని తెలిపారు. గత 15 సంవత్సరాలుగా అడ్రస్ లేని వాన్‌పిక్ ప్రతినిధులు ఇప్పుడు మండల

▶ 2లో

ప్రత్యామ్నాయ విద్యా విధానాల కోసం కృషి చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

కోరారు. ఈ సమావేశాలలో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు, రాష్ట్ర సహ అధ్యక్షులు కె.సురేష్ కుమార్, ఎఎన్. కుసుమకుమారి, కోశాధికారి బి,గోపిమూర్తి, యుటిఎఫ్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి పి.బాబురెడ్డి, సీనియర్ నాయకులు ఎం. వెంకటేశ్వరరెడ్డి, యుటిఎఫ్ ప్రకాశం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఓ,వీరారెడ్డి, ఎస్.రవి, కోశాధికారి చిన్నస్వామి, సహ అధ్యక్షులు ఉమా మహేశ్వరి,అబ్దుల్ హై,రాష్ట్ర కార్యదర్శులు వివిధ జిల్లాల నుంచి 200 మంది కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ సభలో పాల్గొన్న ఉపాధ్యాయులు, నాయకులు

ఉద్యమాలపై నిర్భందం తగదు..

ప్రజా ఉద్యమాలు, ఉపాధ్యాయ ఉద్యమాలపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఉక్కుపాదం మోపుతున్నారని, నిర్భందాలతో ఉద్యమాలను అణచివేయాలని చూస్తున్నారని ఎమ్మెల్సీలు కెఎస్.లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు, ఎస్‌కె.సాబ్జీ ఆగ్రహం వ్యక్తం చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర మధ్యంతర కౌన్సిల్ సమావేశాల సందర్భంగా ఆదివారం రాత్రి స్థానిక రైస్ మిల్లర్స్ అసోషియేషన్ హాలులో నిర్వహించిన సభలో వారు మాట్లాడారు. తమ సమస్యలపై ఉపాధ్యాయులు నిరసనలు, ఆందోళనలకు పిలుపునిస్తే పోలీసులను ప్రయోగించి వాటిని విచ్ఛిన్నం చేసేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యంగం కల్పించిన హక్కులను సైతం కాలరాసేలా వైసిపి ప్రభుత్వ వైఖరి ఉందని తెలిపారు. నిర్భందాలతో ఉద్యమాలను ఆపలేరని, అరెస్టులు, కేసులు, జైళ్లకు వెరవబోమని హెచ్చరించారు. ఐక్య ఉద్యమాలతో నిర్భందాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. తక్షణమే మెగా డిఎస్‌సి ప్రకటించాలని, జీవో నంబర్ 117ను రద్దు చేయాలన్నారు. ఉద్యోగులకు పిఆర్‌సి బకాయిలు ఇవ్వాలని కోరారు.

సామాజిక స్పృహ యుటిఎఫ్ ప్రత్యేకత....

హక్కుల కోసం పోరాడటమే కాకుండా , విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడానికి యుటిఎఫ్ కృషి చేస్తుందని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్. వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్. ప్రసాద్ తెలిపారు. యుటిఎఫ్ రాష్ట్ర మధ్యంతర కౌన్సిల్ సమావేశాల సందర్భంగా యుటిఎఫ్ ప్రచురణ విభాగం ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు మోడల్ పరీక్షా పత్రాలు తయారు చేసిన ఉపాధ్యాయులకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు వ్యాపార దృక్పథంతో కాకుండా సామాజిక స్పృహతో తక్కువ ఖర్చుతో మోడల్ పేపర్లు ముద్రించడం యుటిఎఫ్ ప్రత్యేకత అని తెలిపారు. మోడల్ పేపర్ల ద్వారా విద్యార్థులకు మంచి మార్కులు రావడానికి కృషి చేసిన ఉపాధ్యాయులందరికీ అభినందనలు తెలిపారు. సభలో ప్రచురణ విభాగం బాధ్యులు యు.రాజశేఖర్, గోపాలకృష్ణ పాల్గొన్నారు. విద్యార్థులకు ఉపయోగపడేలా సాంఘిక శాస్త్రంపై డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉపాధ్యాయుడు కృష్ణారెడ్డి రచించిన పుస్తకాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు.

రెవెన్యూ రీ సర్వేతో ప్రయోజనం శూన్యం

ప్రజాశక్తి-టంగుటూరు

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా క్షేత్రస్థాయిలోనే రైతుల భూసమస్యలను తొలగించాలన్న సదుద్దేశంతో చేపట్టిన రీ సర్వే ప్రక్రియ కొందరు రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యంతో అపహాస్యమవుతోంది. అధికారులు సర్వే హద్దురాళ్ళను ప్రభుత్వ భూముల్లో పాతే క్రమంలో పక్కనే పట్టా భూములు సాగు చేసుకుంటున్న రైతుల సమక్షంలో రీ సర్వే చేసి హద్దు రాళ్లను పాతాల్సి ఉండగా రెవిన్యూ అధికారుల ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తున్న కొందరు సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో సమస్య మళ్ళీ మొదటికొస్తోంది. సర్వే చేసి హద్దురాళ్లను పాతి సిబ్బంది వెళ్లిపోయిన వెంటనే హద్దురాళ్ళను చూసుకున్న రైతులు అవాక్కవుతూ అధికారులు తమ హద్దుల్లో రాళ్ళను పాతారంటూ వాటిని తొలగించడం గమనార్హం. దీంతో సమస్య మళ్ళీ మొదటికి వచ్చి రైతులు వెంటనే రెవిన్యూ కార్యాలయాలకు పరుగులు పెడుతున్నారు. రీ సర్వే ప్రారంభించిన క్రమంలోనే రైతుల సమక్షంలో హద్దురాళ్లను పాతితే ప్రజాధనం వధా కాకుండా ఉంటుందని రైతులు అధికారుల తీరుపై విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. రెవిన్యూ ఉన్నతాధికారులు స్పందించి రీ సర్వేను మళ్ళీ రైతుల సమక్షంలో పారదర్శకంగా చేపట్టి భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని మండల రైతులు డిమాండ్ చేస్తున్నారు.

టిడిపి కార్యకర్తలను ఇబ్బంది పెడితే సహించేది లేదు : దామచర్ల

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

టిడిపి కార్యకర్తలను ఇబ్బందిపెడితే సహించేది లేదని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఒంగోలు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు తెలిపారు. స్థానిక మౌర్య సెంటర్‌లో గుడ్ మార్నింగ్ ఫ్రెండ్స్ అసోషియేషన్ ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో జనార్ధన్ మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రస్తుత సైకో పాలనలో అన్నీ వర్గాల వారు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర స్థాయి పెద్ద సైకోకి మించిపోయే విధంగా నియోజకవర్గంలో పిల్ల సైకో తయారయ్యాడని తెలిపారు. కొత్తగా పార్టీలో చేరుతున్న వారిని, టిడిపి తరుపున మీటింగ్‌లు పెట్టే వారికి ఫోన్ చేసి బెదిరిస్తున్నాడని ఆరోపించారు. గతంలో ఎప్పుడూ ఇలాంటి దరిద్రపు పరిస్థితులు చూడలేదన్నారు. ప్రతిదీ వడ్డీతో సహా లెక్కించి చెల్లిస్తామని ఆయన హెచ్చరించారు. అధికారులు కూడా వైసిపి వారిని భుజాన వేసుకొని పనిచేస్తున్నారని, వారు పూర్తిగా ఇబ్బందులు పడుతారని హితవు పలికారు. వైసిపి నాలుగేళ్లపాలనలో వార్డుకు రూ.20 లక్షలు కూడా నిధులు ఇవ్వలేని దౌర్భాగ్యపు పాలన ఇచ్చారని, ఇలాంటి దుస్థితి ఏ రాష్ట్రానికి లేదన్నారు.

మన రాష్ట్రం రూ. 10 లక్షల కోట్ల రూపాయల అప్పుల్లో కూరుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెట్టి అభివృద్ధి బాటలో నడపాలంటే టిడిపి అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యర్తలంతా ఐదారు నెలలు కష్టపడి పనిచేసి పార్టీని అధికారంలోకి తీసుకు రావాలని కోరారు. యువగళం పాదయాత్రలో లోకేష్ వాగ్దానం చేసిన ప్రకారం ఒంగోలు నగరానికి అండర్ గ్రౌండ్ డ్రైనేజి, మంగమూరు రోడ్డు చివరి వరకూ సిమెంటు రోడ్డు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తామని తెలిపారు.

ఎవరికి ఏ ఇబ్బంది వచ్చినా, అర్ధరాత్రి ఫోన్ చేసినా అందుబాటులో ఉంటానని చెప్పారు. ఈ సమావేశంలో అసోషియేషన్ ప్రతినిధులు నాగేంద్ర ప్రసాద్, కృష్ణారావు, వెంకట్రావు, గోపాలకృష్ణ, శ్రీనివాస్, చంద్రశేఖర్, హరిబాబు, బ్రహ్మం, శ్రీరామ్ మూర్తి, శ్రీధర్, నాగేశ్వరరావు, దామచర్ల వెంకట్రావు, దిలీప్, రాఘవ, రామ్ కల్లూరి, శేషగిరి రావు పాల్గొన్నారు.

మోడీకి చంద్రయాన్ పై ఉన్న శ్రద్ధ మణిపూర్ పై ఏది?

సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ

ప్రజాశక్తి - చీరాల

మతోన్మాదం చేతుల్లో అటుడికి పోయిన మణిపూర్ రాష్ట్రంపై నోరు మెదపని దేశ ప్రధానికి చంద్రయాన్-3 ప్రయోగం, ల్యాండింగ్ స్థలం నామకరణపై పెట్టిన దృష్టి మణిపూర్ రాష్ట్రం పై లేకపోవడం దుర్మార్గమని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి కె నారాయణ అన్నారు. తన చిన్ననాటి స్నేహితుడైన పన్నెం సుబ్బారావు భార్య పన్నెం శ్రీవల్లి ఆగస్టు21 తేదీన మరణించగా ఆ కుటుంబాన్ని పరామర్శించేందుకు నారాయణ ఆదివారం జాండ్రపేట వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలు విభజన హామీలు గాలికొదిలి క్షమ భిక్ష కోసం మోదీ చుట్టూ తిరుగుతున్నారని గుజరాత్ లో అల్లర్లు

శ్రీవల్లి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నారాయణ

జరిగినప్పుడు మోడీ ముఖ్యమంత్రి అని,మణిపూర్ లో జరిగినప్పుడు ప్రధాన మంత్రి అని కానీ అటువైపు చూసే తీరిక ఆయనకు లేదని అన్నారు. రాబోయే ఎన్నికల్లో మోడీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పక తప్పదు అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యదర్శి ఎం ఎల్ నారాయణ,వ్యవసాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్ వెంకట్రావు, సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిరుమల ప్రకాష్,సీపీఐ సీనియర్ నాయకులు మేడ వెంకట్రావు,ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు అచ్యుతుని బాబురావు,సీపీఐ పట్టణ కార్యదర్శి సైకం రాజశేఖర్, సుబ్బారావు చేనేత జన సమైక్య నాయకులు మాచర్ల మోహనరావు,కృష్ణ మోహన్,సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

భూములు ఇచ్చేది లేదు

(మొదటిపేజీ తరువాయి)

పరిధిలోని పుల్లారిపాలెం, కటారిపాలెం గ్రామాల భూముల్లో గుట్టు చప్పుడు కాకుండా తిరుగుతున్నారని విమర్శించారు. రైతులకు ఇచ్చిన వాగ్ధానాలను నెరవేర్చని వాన్‌పిక్‌కు భూములు ఇచ్చేదేలేదని వారు హెచ్చరించారు. రైతులు చేసుకుంటున్న భూములకు సాగునీరు, విద్యుత్ ఇవ్వకుండా ఆటంకపరుస్తున్నట్లు తెలిపారు. సుప్రీంకోర్టు స్టేటస్కో ఇచ్చిన నేపథ్యంలో చైర్మన్ నిమ్మగడ్డ ప్రసాద్ శనివారం భూముల్లో తిరగడాన్ని ప్రభుత్వం ఎలా అనుమతిస్తుందని వారు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మచ్చ అయ్యప్ప రెడ్డి, ఆంజనేయులు, శివరాడియన్ సత్తి వేలు, హేతువాద నాయకులు పల్లపోలు నాగ మనోహర్ లోహియా తదితరులు పాల్గొన్నారు.

సలగల నాగరాజు(కింగ్ సాల్మన్)

సినీ జాతీయ అవార్డుకు చీరాల స్టంట్ మాస్టార్

ప్రజాశక్తి - చీరాల

చిత్ర పరిశ్రమలో ఆర్‌ఆర్ మూవీకు స్టంట్ మాస్టర్‌గా చీరాల మండలం తోటవారిపాలెంకు చెందిన సలగల నాగరాజు(కింగ్ సాల్మన్)కు ఉత్తమ స్టంట్ మాస్టర్ గా జాతీయ అవార్డుకు ఎంపిక అయ్యారు. చీరాల వి ఆర్ ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థి, తన ప్రియా శిష్యుడు అయిన నాగరాజు బాహుబలి 2, ట్రిపుల్ ఆర్,పలు చిత్రాలకు స్టంట్ మాస్టర్ గా వ్యవహరిస్తూ అనేక అవార్డులు కైవసం చేసుకోవడం హర్షనీయమని కళాశాల కమిటీ ప్రతినిధి మరియు పద్మ భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ గంట అనిల్ కుమార్ అన్నారు. తమ విద్యార్థి జాతీయ అవార్డుకు ఎంపిక అవ్వటం పట్ల కళాశాల కమిటీ సభ్యులతోపాటు పూర్వ విద్యార్థులందరూ స్టంట్ మాస్టర్ నాగరాజుకు ప్రశంసలు జల్లు కురిపిస్తున్నారు.ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 69 వ జాతీయ ఉత్తమ చిత్రాల అవార్డులలో 2021గాను ఆర్‌ఆర్‌ఆర్‌ను ఎంపిక చేయగా అందులో స్టంటు ఉత్తమ మాస్టారుగా నాగరాజును ఎంపిక చేశారని అన్నారు. త్వరలోనే చీరాలకు స్టంట్ మాస్టర్ తన స్వగ్రామం తోటవారిపాలెంకు రానున్నారని ఆయనకు కళాశాల తరపున ప్రత్యేక సన్మాన కార్యక్రమాలను చేయబోతున్నట్లు వారు తెలిపారు.ఈ సందర్భంగా కళాశాల పూర్వ విద్యార్థులు మరియు సాల్మన్ స్నేహితులు వనమా జయకుమార్, కొప్పుల వాసుబాబు, గొట్టిపాటి బాబురావు, భక్తుల రాజశేఖర్, చెల్లి బాబురావు, గట్టుపల్లి శ్యాం ప్రసాద్, ప్రశాంత్ కుమార్ తదితరులు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

దేవస్థానానికి ఫ్రిజ్ బహూకరణ

ప్రజాశక్తి-పామూరు

పామూరు-2 ఎంపిటిసి ఆకుపాటి వెంకటేష్ కుమారుడు నొహిత్ జన్మదిన వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీమదన వేణుగోపాలస్వామి దర్శనార్థంకి వచ్చే భక్తుల సౌకర్యార్థం కూలింగ్ మినరల్ వాటర్ ఫ్రిజ్‌ను దేవస్థాన చైర్మన్ గుర్రం వెంకటేశ్వర్లుకు అందజేశారు. తొలుత శ్రీ మదన వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ మదన వేణుగోపాల స్వామి దేవస్థానం చైర్మన్ గుర్రం వెంకటేశ్వర్లు, ఆలయ ప్రధాన అర్చకులు సత్యబాబు, నీరుకట్టు నాయబ్ రసూల్, గాడి మాలకొండయ్య, పుప్పాల రామ్మూర్తి, జై చంద్ర, వల్లం విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రైళ్లు ఆగక.. రాకపోకలు సాగక..

- ఒక వైపు ఆగిన రైలు మరో వైపు ఆగదు
- అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం శూన్యం
- అలంకారప్రాయంగా తర్లుపాడు రైల్వేస్టేషన్
- అవస్థలు పడుతున్న తర్లుపాడు ప్రయాణీకులు

తర్లుపాడు రైల్వేస్టేషన్

ప్రజాశక్తి-తర్లుపాడు

తర్లుపాడు మండల ప్రజలకు సరైన రవాణా సౌకర్యాలు లేక ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధాన నగరాలను కలుపుతూ తర్లుపాడు నుంచి బస్సు సౌకర్యం లేదు. రైలు సౌకర్యం ఉన్నప్పటికీ కోవిడ్ తర్వాత కేంద్ర ప్రభుత్వం ప్యాసింజర్ రైళ్లను ఎక్స్‌ప్రెస్‌గా మార్చి తర్లుపాడులో కొన్ని రైళ్లకు స్టాపింగ్ లేకుండా నడుపుతున్నారు. ఈ విషయంపై ఎన్నో పర్యాయాలు రైల్వేశాఖ ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధుల దష్టికి మండల ప్రజలు తీసుకొని వెళ్లారు. అయినప్పటికీ ఫలితం కనిపించడం లేదు. తర్లుపాడు నుంచి నంద్యాల వైపు వెళ్లే 17253 నెంబర్ గల సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ కోవిడ్‌కు ముందు ఈట్రైన్ తర్లుపాడులో హాల్టు ఉండేది. కోవిడ్ తర్వాత తర్లుపాడులో హాల్ట్ తొలగించారు. దాంతో నంద్యాల-డోన్-కర్నూలు-సికింద్రాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందులు నెలకొన్నాయి. గతంలో గుంటూరు నుంచి నంద్యాల వైపు ఉదయం 9 గంటలకు కాచిగూడ మధ్యాహ్నం ఒంటిగంటకు హుబ్లీ వెళ్లే ప్యాసింజర్ రైళ్లు తర్లుపాడులో ఆగేవి. ప్రస్తుతం ఉదయం సికింద్రాబాద్ వైపు వెళ్లే రైలు మాత్రమే ఉంది. అది కూడా తర్లుపాడు స్టేషన్‌లో ఆగకపోవడంతో తర్లుపాడు మండల ప్రజలతో పాటు మార్కాపురం మండలంలోని కొన్ని గ్రామాలు హనుమంతునిపాడు మండలం కనిగిరి తదితర గ్రామాల ప్రజలు నంద్యాల వైపు ప్రయాణించడానికి ప్రైవేటు వాహనాలను అధిక చార్జీలు వెచ్చించి ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. అలాగే 17228 నెంబర్ గల సాయంత్రం వేళ గుంటూరు నుంచి డోన్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ కూడా తర్లుపాడులో హాల్టు లేదు. 17261 నెంబర్ గల గుంటూరు నుండి పుణ్యక్షేత్రమైన తిరుపతికి, అలాగే కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాలకు ప్రయాణించే ప్రయాణికులకు ఎంతో ఉపయోగంగా ఉన్నా ఈ ట్రైన్ కూడా తర్లుపాడు మండల కేంద్రమైనప్పటికీ హాల్టు లేదు. వెంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లే పేదభక్తులకు ఎంతో ఉపయుక్తంగా ఉన్న ఈ రైలును కూడా తర్లుపాడులో ఆపాలని భక్తులు ప్రయాణికులు మొరపెట్టుకున్న ఫలితం దక్కటం లేదు. అలాగే రాత్రి వేళల్లో హుబ్లీ-విజయవాడ విజయవాడ-హుబ్లీ వెళ్లే అమరావతి ఎక్స్‌ప్రెస్ కూడా గతంలో ఎన్నో ఏళ్లుగా తర్లుపాడు రైల్వే స్టేషన్లో స్టాపింగు ఉంది. కోవిడ్ అనంతరం అమరావతి ఎక్స్పెస్ కూడా స్టాపింగ్ లేకుండా అధికారులు చేశారు. ఈ సమస్యలన్నీ కూడా ఎటువంటి ఆర్థిక లావాదేవులతో ముడిపడి ఉండనప్పటికీ అటు అధికారులూ పట్టించుకోకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు దూరప్రాంతాలకు ఖరీదైన ప్రయాణాలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇది ఇలా ఉండగా నియోజకవర్గమైన మార్కాపురం వెళ్లే తర్లుపాడు మార్కాపురం రోడ్డులోని తర్లుపాడు రైల్వే గేట్ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలని ఎన్నో ఏళ్లుగా తర్లుపాడు మండల ప్రజలు కలలు కంటున్నారు. ఇటీవల గుంటూరు-గుంతకల్ రైల్వే లైన్ డబల్ పూర్తి కావడంతో రైలు గేటు గంటల తరబడి మూసి ఉండటంతో ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. ఈ విషయాలు అన్నింటి పైన అధికారులు దష్టి పెట్టి తర్లుపాడు మండల ప్రజల కోర్కెను తీర్చాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

వైసిపిలో కష్టపడేవారందరికీ 'బీమా'

- ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం

వైసిపిలో కష్టపడే వారందరికీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.10లక్షల మేర ఉచిత బీమా సౌకర్యం కల్పించబోతున్నారని, ఈ సౌకర్యాన్ని ముందుగా జెసిఎస్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు సద్వినియోగం చేసుకోవాలని మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి విజ్ఞప్తి చేశారు. వైసిపి జెండా నిలబెట్టేందుకు కీలకమైన వ్యక్తుల కుటుంబాల ఆర్థిక భరోసా కోసం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఈ నిర్ణయం తీసుకుందన్నారు. జెసిఎస్ కన్వీనర్ల సమావేశం స్థానిక ఏ1 గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం మార్కాపురం మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీక్రిష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి మాట్లాడుతూ సిఎం జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత అందరి అవసరాలు తీరేలా నవరత్నాల పేరుతో పథకాలను రూపొందించారన్నారు. వాలంటీర్లు అర్హత ఉన్న ఇంటికి వెళ్ళి పథకం అందించేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. వైసిపిలో ప్రతి కార్యకర్త వచ్చే ఎన్నికల్లో విజయం కోసం కీలకంగా పనిచేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజా మ్యానిఫెస్టో ఉంటుందన్నారు. సిఎం జగన్ ఎన్నికల మ్యానిఫెస్టోపై ప్రజలకు నమ్మకం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, వైసిపి రాష్ట్ర సహాయ కార్యదర్శి డాక్టర్ మీర్జా షంషీర్‌అలీబేగ్, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు షేక్ ఇస్మాయిల్, సిహెచ్ అంజమ్మ శ్రీనివాస్, మార్కాపురం జడ్‌పిటిసి నారు బాపన్‌రెడ్డి, వైసిపి అన్ని మండలాల కన్వీనర్లు, జడ్‌పిటిసిలు, ఎంపిపిలు, సర్పంచులు, కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

ఉపాధ్యాయుడు అకాల మృతి

ప్రజాశక్తి-కొండపి

కొండపి మండలం యంపిపిఎస్ దేవిరెడ్డిపాలెంలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న పాలెపు మల్లిఖార్జునరావు(45) అకాలమృతి చెందాడు. ఏపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ పి.హనుమంతరావు, యంఈవో 2 రామారావు, ఉపాద్యాయులు ఆయన మృతికి ప్రాగాడ సానుభూతిని తెలియచేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ మల్లిఖార్జునరావు ఉపాద్యాయునిగా పలుగ్రామాల పాఠశాలల్లో పనిచేసి విద్యార్థులకు ఉత్తమ బోధన అందించారని తెలియజేశారు.

ఉరి వేసుకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం పాకల గ్రామంలో ఉరేసుకొని ఆదివారం ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. ఉలవపాడుకు చెందిన కూరిమెట్ల ఏసురత్నం(70) పాకల్లోని ఆళ్ల రామలింగారెడ్డికి చెందిన తోటలోని మామిడి చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ టి శ్రీరామ్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.

రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాలలోని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక సాయి మందిరంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఎస్సై అంకమరావు ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. ప్రతి ఒక్క యువకుడు రక్తదానం చేయడం అలవాటు చేసుకోవాలని చెప్పారు. శిభిరంలో 30 మంది యువకులు పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు తంగిరాల రామిరెడ్డి, శేఖర్, మొగిలి గుప్తా, రమణారెడ్డి, సుబ్బారావు, శ్రీకాంత్‌రెడ్డిలతో పాటు మార్కాపురం బ్లడ్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఒక్క చాన్స్‌తో రాష్ట్రం సర్వనాశనం

ప్రజాశక్తి-కొండపి

ఒక్క చాన్స్ అంటూ ప్రజలకు మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకురాలు రావిపాటి సీతమ్మ, మండల పార్టీ మహిళా అధ్యక్షురాలు బొద్దులూరి ప్రసన్నలక్ష్మి అన్నారు. ఆదివారం మండలంలోని పెదకండ్లగుంట గ్రామంలో మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా చంద్రబాబునాయుడు ప్రకటించిన మేనిపెస్టో కరపత్రాలను ఇంటింటికి పంచిపెట్టారు. చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన మేనిపెస్టోతో మహిళలకు ఒక వరంగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు స్వాములు, మండల పార్టీ అద్యక్షులు బి.యలమందనాయుడు, మండల మహిళా ఉపాద్యక్షురాలు మంగమ్మ, గ్రామంలోని మహిళలు, మాజీ సర్పంచ్ తానికొండ వెంకటేశ్వర్లు, గ్రామ అద్యక్షులు కొల్లూరి మల్లిఖార్జునరావు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు దరిశి ఎఎంసి కార్యవర్గం ప్రమాణం

దరిశి : నేడు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతనంగా చైర్మన్‌గా షేక్ షకీలా, వైస్ చైర్మన్‌గా కండె గంగయ్యలతో పాటు కమిటీలో డైరెక్టర్లు అందరూ ప్రమాణ స్వీకారం చేస్తారని మార్కెట్ కమిటీ ప్రత్యేక కార్యదర్శి పి మస్తాన్‌రావు తెలిపారు. ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే డాక్టరు మద్దిశెట్టి వేణుగోపాల్ హాజరవుతారని ఆయన తెలిపారు. కావున అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరు కావాలని కోరారు.

బస్సు యాత్రను జయప్రదం చేయండి

సిఎస్ పురంరూరల్ :రాష్ట్రాన్ని రక్షించండి దేశాన్ని కాపాడండి అనే నినాదంతో సిపిఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బస్సు యాత్రను జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి ఎస్ కే వై పెదమస్తాన్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి బోరుబోయిన వెంకట కొండయ్య యాదవ్ పిలుపునిచ్చారు. మండలంలోని నల్లమడుగుల గ్రామంలో బ్రహ్మంగారు కాలనీలో ఆదివారం సిపిఐ బస్సు యాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ బస్సు యాత్ర ఈనెల 19వ తేదీ ఉదయం 10 గంటలకు కనిగిరి చేరుతుందని, హనీఫ్ స్తంభం నుండి ర్యాలీ ప్రారంభమై పామూరు బస్టాండులో బహిరంగ సభ ఉంటుందని చెప్పారు. కావున మండలం లోని సిపిఐ కమ్యునిస్ట్ నాయకులు, కార్యకర్తలు అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు అంకయ్య, నియోజకవర్గ జై నాయకురాలు రాగి ఎంకమ్మ, జయంపు గురవయ్య, ఏడుకొండలు పాల్గొన్నారు

స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో సిఐ, ఎస్ఐలు

అక్రమంగా తరలిస్తున్న గోవా మద్యం పట్టివేత

ప్రజాశక్తి- కారంచేడు

గోవా నుంచి చీరాలకు అక్రమంగా తరలిస్తున్న 140 మ్యాన్షన్ హౌస్ మద్యం బాటిళ్లను కారంచేడు పోలీసులు ఆదివారం నాడు పట్టుకున్నారు. చీరాల రాంనగర్‌కు చెందిన ఓ మహిళ గోవా నుంచి వాస్కోడిగామా రైల్వే స్టేషన్ వద్ద మద్యం తక్కువ ధరకు కొనుగోలు చేసి చీరాలలో ఎక్కువ రేటుకు లాభాలకు అమ్ముకుంటానికి కారులో తరలిస్తుండగా పోలీసులు అందిన సమాచారంతో స్థానిక కాల్వ సెంటర్లో కాపు కాసి వారిని పట్టుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఇంకొల్లు సీఐ వి సూర్యనారాయణ మాట్లాడుతూ అక్రమ మద్యం తరలిస్తున్న మహిళను, కారు డ్రైవర్‌ని, కారును కూడా స్వాధీనం చేసుకున్నట్లుగా తెలిపారు. వారిపై కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా మద్యాన్ని గాని, మత్తు పదార్థాలను గాని తరలిస్తే చట్టపరంగా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు. అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్ళను పట్టుకున్నందుకు గాను బాపట్ల జిల్లా ఎస్‌పి వకూల్ జిందాల్ ఇంకొల్లు సీఐ సూర్యనారాయణను, కారంచేడు ఎస్ఐ జి శ్రీనివాసరావును ఇతర సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

మోటార్ సైకిళ్లు ఢీ
ఇద్దరికి గాయాలు, ఒకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-కొండపి

రెండు మోటార్ సైకిళ్లు ఢీకొన్న సంగటన కొండపి మండలంలోని పెరిదేపి -కొండపి మద్య ఉన్న రామాయకుంట దగ్గర చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్లగా ముప్పవరం గ్రామానికి చెందిన ఇనకొల్లు మాదవరావు అతని భార్య సుబాషిని ఇద్దరు కలిసి ద్విచక్రవాహనంపై కొండపికి వస్తున్నారు. అదే విదంగా టంగుటూరు మండలం కొణిజేటి గ్రామానికి చెందిన పచ్చబొట్లు రామకృష్ణ అనే వ్యక్తి కొండపి నుంచి తన స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై భయలు దేరాడు. ఈ క్రమంలో పెరిదేపి సమీపంలో రాంగు సైడు వెళ్లి ఎదురుగా వస్తున్న మదవరావు ద్విచక్రవాహనాన్ని వెగంగా ఢీకొట్టడం జరిగింది. ఈ సంఘటనలో మాదవరావు దంపతులు ఇద్దరికి స్వల్ప గాయాలు కాగా రామకృష్ణకి తీవ్రగాయాలు అయ్యాయి. ఇద్దరిని 108 వాహనంలో కొండపి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొనివచ్చి ప్రథమ చికిత్స చేశారు.

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మహిళ

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి-మద్దిపాడు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన మద్దిపాడులో ఆదివారం చోటు చేసుకుంది. మద్దిపాడు ఎస్సై శ్రీకాంత్ వివరాల ప్రకారం గుండ్లపల్లి గ్రామానికి చెందిన ఉండవల్లి శ్రీలక్ష్మి సుబ్బా ప్రసాద్ దంపతులు బైక్ పై ఒంగోలు వెళుతుండగా మద్దిపాడు ఫ్లైఓవర్ దిగుతుండగా బస్సు తగిలి శ్రీలక్ష్మి అక్కడికక్కడే మృతి చెందింది. సుబ్బా ప్రసాదుకు గాయాలవగా ఒంగోలు రిమ్స్‌కి తరలించారు. ఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ కొమ్మినేని వీరశంకర్

గ్రామీణ ప్రాంతాలకు కార్పొరేట్ వైద్యం

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

గ్రామీణ ప్రాంత ప్రజలకు కార్పొరేట్ వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఉచిత వైద్య శిబిరాలే ఏర్పాటు చేస్తున్నట్లు రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ఇంటూరి ఆంజనేయులు, అధ్యక్షులు తాళ్లూరి సాంబశివరావు అన్నారు. వైద్యశిభిరాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్థానిక ఎంఎస్ఎన్ జెడ్పి హై స్కూల్ ఆవరణలో గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. చిలకలూరిపేట కొమ్మినేని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ చైర్మన్, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ కొమ్మినేని వీరశంకరరావు నేతృత్వంలో ఒంగోలు, ఉయ్యూరు పట్టణాల నుండి డాక్టర్ మక్కెన వంశీకృష్ణ, కొమ్మినేని రేష్మ, పి నవీన్ కృష్ణ, దొంతినేని కృష్ణ చైతన్య, కోట రవి, జడా జతిన్ దేవ్, పి వెంగమాంబ, రవళి, దంత వైద్యులు పేర్ని కృష్ణ మోహన్, వైద్య సిబ్బంది సేవలు అందించారు. హాజరైన ప్రతి ఒక్కరికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. శిభిరానికి వచ్చిన వారికి భోజన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎఫర్ట్ చైర్మన్ జాష్టి మోహనరావు, క్యాంపు కన్వీనర్ కందిమళ్ల కోటేశ్వరరావు, గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రత్తిపాటి సురేష్, దేవినేని శ్రీనివాసరావు, కుర్రా వెంకటరామయ్య, చెరుకూరి అంజిబాబు పాల్గొన్నారు.

కరాటేలో పథకాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు

కరాటేలో బంగారు పతకాలు

ప్రజాశక్తి - వేటపాలెం

విద్యార్థులు ఆత్మరక్షణ విద్యలైన కరాటే నేర్చుకోవడం వలన మానసిక, శారీరక దృఢత్వం పెంపొందించుకోవచ్చని కరాటే మాస్టర్ వి బ్రహ్మనాయుడు అన్నారు. చీమకుర్తిలోని బూచేపల్లి వెంకాయమ్మ సుబ్బారెడ్డి కళ్యాణ మండపం నందు రాష్ట్రస్థాయి 5వ కరాటే కుంగ్ఫు ఛాంపియన్షిప్ టోర్నమెంట్ ఆదివారం నిర్వహించారని తెలిపారు. తధాగత్ బోధి ధర్మ సిటోరియా కరాటే ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో పోటీలు జరిగాయని అన్నారు. పోటీలలో తమ విద్యార్థులు ఎస్ అజయ్, శ్రీరామ్, సాత్విక్, యశ్వంత్, బాన్ రోనాల్డ్ కరాటే విభాగంలో బంగారు పతకాలు అందుకున్నారని తెలిపారు. ఈ విద్యార్థుల తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్లనే ఈ పథకాలు సాధించారని ఆయన తెలిపారు.

బాపట్లది అద్వితీయ పాత్ర

ప్రజాశక్తి - బాపట్ల

పిసి సాయిబాబు

తెలుగు భాషా వికాసంలో బాపట్ల అద్వితీయమైన పాత్రను పోషించిందని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి పిసి సాయిబాబు అన్నారు. ఈనెల 29న తెలుగు భాషా దినోత్సవ సందర్భంగా ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బాపట్ల కవులు ఎందరో తెలుగు భాషను సుసంపన్నం చేశారని అన్నారు. తెలుగు భాషార్చన చేసిన బాపట్ల కవులలో రాయప్రోలు, తుమ్మల, జాషువా అగ్రగణ్యులని తెలిపారు. బాపట్ల తెలుగు తల్లి పుట్టినిల్లని అన్నారు. తెలుగు పద్యం, తెలుగుకు కావ్య భాష హోదా కల్పించింది బాపట్లే అని అన్నారు. లేఖాసాహిత్యానికి శ్రీకారం చుట్టింది బాపట్ల కవయిత్రి కనుపర్తి వరలక్ష్మమ్మ అని గుర్తు చేశారు. ఇలా తెలుగు భాష అభివృద్ధిలో బాపట్ల ప్రముఖ పాత్ర పోషించిందని వివరించారు. బాపట్లకు చెందిన ఎందరో కవులు, కళాకారులు తెలుగు భాషకు పెద్దపేట వేశారని అన్నారు.

బరితెగించిన జరుగుమల్లి ఇసుక మాఫియా

ప్రజాశక్తి - శింగరాయకొండ

ప్రకాశం జిల్లా జరుగుమల్లి ఇసుక మాఫియా అంటే అందరికీ తెలిసిందే. వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి జరుగుమల్లి మండలాన్ని వైసిపి నాయకులు చుట్టుముట్టారు. పాలేరు నదిని ఇసుక మాఫియా తవ్వేస్తున్నారు. అక్రమ ఇసుక తవ్వకాలకు అడ్డుకట్ట వేసేందుకు అధికార యంత్రాంగం విఫలమయ్యారు. అప్పుడప్పుడు నామ మాత్రపు దాడులతో మమ అనిపించుకుంటున్నారు. వైసిపి జిల్లా నాయకత్వం అండతా ఇసుక మాఫియా రాజ్యమేలుతున్నారు. జరుగుమల్లి మండలంలోని బిట్రగుంట నుంచి పచ్చవ వరకు పాలేరు నదిలో ఇసుక తరలించేస్తున్నారు. గత నెలలో జరుగుమల్లి మండలం సతుకుపాడు గ్రామం వద్ద సుమారు రూ.10కోట్ల విలువచేసే ఇసుకపై వైసీపీ నేతల కన్ను పడింది. ఎలాగైనా ఆ ఇసుకను తరలించేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఆ ప్రయత్నానికి జిల్లా యంత్రాంగం అడ్డుపడింది. దీంతో అలా వాయిదా వేసుకుంటూ వచ్చారు. తాజాగా

పాలేరులో రోడ్డు నిర్మాణం చేస్తున్న జెసిబి

పట్టపగలే రోడ్డుకు పట్టితోలుతున్న ట్రాక్టర్

- ఇసుక కోసం పాలేరులో రోడ్డు
- కలెక్టర్ సెలవుతో రోడ్డు కోసం కదిలిన జెసిబి
- కోట్ల రూపాయల ఇసుకే వైసిపి టార్గెట్
- కన్నెత్తి చూడని అధికార యంత్రాంగం

జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ సెలవులో వెళ్లారని తెలుసుకున్న ఇసుక మాఫియా బుధ, గురువారంలో అనువు చేసుకున్నారు. వైసీపీ నాయకులు అక్కడే తిష్ట వేసి వాహనాల ద్వారా జరుగుమల్లి మండలం సతుకుపాడు వద్ద పాలేరు నదిలో రోడ్డు వేశారు. పట్టపగలే రోడ్డు వేసి వైసిపి నేతలు అధికార దర్పం చాటుకున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు ఎవ్వరు అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. కలెక్టర్ సెలవులో ఉండటంతో తమను పట్టించుకునే వాళ్లెవ్వరూ లేరనే ధీమాతో ఉన్నారు. నదిలోకి రోడ్డు వేసి రూ.10కోట్ల విలువ చేసే ఇసుకను కాజేసేందుకు సిద్ధమయ్యారు. గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేసినా వైసిపి నేతలు మాత్రం అంతా తమ ఇష్టమనే ధీమాతో ముందుకెళుతున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. అధికారులు వదిలేయడం వెను లక్షలు చేతులు మారాయనే ఆరోపణలు ఉన్నాయి. వైసిపిలో పెద్ద నాయకుల అండ లేకుండా ఇంత పెద్ద ఎత్తున ఇసుక తరలింపుకు సిద్ధం కాలేరనే విమర్శ ఉంది. పంచాయితీ, రెవెన్యూ, పోలీసు, సెబ్ విభాగాల అధికారులు ఇసుక మాఫియాకు సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు మామూళ్ల మత్తులో కనీసం రోడ్డుపై కూడా కనిపించడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. అధికారులు నిఘా పెడితేనే అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని ప్రజలు అంటున్నారు. మాఫియా పనులు ప్రజల్లో చర్చకు దారితీశాయి.

పాలేరులో నిర్మాణం చేసిన మట్టిరోడ్డు

ఆర్ఓ వాటర్ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని నాగులపాలెంలో నాగులపాలెం గంగ ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సభలో రోటరీ ప్రెసిడెంట్ నాగభైరు శ్రీనివాసరావు, సపోర్ట్ అధ్యక్షులు, పోలిశెట్టి చంద్రశేఖరరావు, సెక్రెటరీ పాబోలు వెంకన్న మాట్లాడారు. పర్చూర్ రోటరీ క్లబ్‌కు సిడిజి జాస్తి రంగారావు చేసిన సేవలు కొనియాడారు. సిడిజి జాస్తి రంగారావు మాట్లాడుతూ తాను డిజిగా ఉన్న కాలంలో పర్చూరు వాటర్ ప్లాంట్‌ను స్థాపించడానికి సహకారం

ప్లాంట్ ప్రారంభిస్తున్న రోటరీ ప్రతినిధులు

అందించానని చెప్పారు. నాగులపాలెం గంగ వ్యవస్థాపక దాతలు ముద్దన హరిబాబు తన పూర్తి సహాయ, సహకారం అందిస్తానని తెలిపారు. సభలో మాజీ జెడ్పీటీసీ కొల్లా సుభాష్ బాబు, నాగులపాలెం సర్పంచ్ డి సుధారాణి, వైస్ సర్పంచ్ ఎ రామకృష్ణను ఘనంగా సన్మానించినారు. ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్స్ భవనం రాజగోపాల్‌రెడ్డి, తేళ్ళ రమేష్ చంద్ర బాధ్యతలు నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో రోటరీ సభ్యులు కెఎస్ఆర్‌కె ప్రసాద్, పి ఉదయ భాస్కర్, కె ఆంజనేయులు, కె అశోక్ కుమార్, తోకల కృష్ణమోహన్, కె కొండల రాయుడు, డి సత్యనారాయణ, కె సత్యనారాయణ, ఎజిజికె రెడ్డి, ఎంపీటీసీ మెంబర్, నాగులపాలెం ఆర్‌సిసి సభ్యులు చాగంటి నాగేశ్వరరావు, ఎ సతీష్ బాబు, ఎ కుప్పస్వామి, కొల్లా శివరామకృష్ణ పాల్గొన్నారు.

శాంతి ర్యాలీ చేస్తున్న క్రైస్తవ సంఘాలు

క్రైస్తవ సమైక్య ర్యాలీ

ప్రజాశక్తి - మేదరమెట్ల

మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై చేస్తున్న అరాచక దాడులను నిరసిస్తూ కోరిసిపాడు మండలంలో క్రైస్తవులు శాంతియుత ర్యాలీ ఆదివారం నిర్వహించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు. రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు అన్నీ జోక్యం చేసుకోవాలని కోరారు. శాంతిని నెలకొల్పేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ర్యాలీలో మండలంలోని అన్ని క్రైస్తవ సంస్థలు, ఫాస్టర్లు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

'మండలి'కి జీవిత సాఫల్య పురస్కారం

ప్రజాశక్తి - అద్దంకి

వీరవల్లి సుబ్బారావు (రుద్రయ్య) సమర్పిత జీవిత సాఫల్య సృజన సాహిత్య పురస్కార సభలో చందుడాన్స్ అకాడమీ విద్యార్థినులు చేసిన నృత్యాలు సభను అలరించాయి. పురస్కార సభకు గాడేపల్లి దివాకర దత్తు అధ్యక్షత వహించారు. అద్దంకి బండలో తరువోజ పద్యం ఉన్నదని కొమఱ్ఱాజు చెప్పి ఇప్పటికి నూరేళ్ళయింది. పద్యాన్ని రక్షించిన భూమి, పద్యానికి గొడుగు పట్టిన భూమి అద్దంకి అని తెలుగు భాషా స్వరూపమైన మండలి బుద్ధ ప్రసాద్‌కు జీవిత సాఫల్య సృజన సాహిత్య పురస్కారం ఇవ్వడం సృజనకు దక్కిన

మాట్లాడుతున్న భూసురుపల్లి వెంకటేశ్వర్లు

గౌరవమని అధ్యక్షులు దివాకరదత్తు అన్నారు. వీరవల్లి రుద్రయ్య సప్తతి అభినందన, సృజన సంచికను మండలి బుద్ధప్రసాద్ ఆవిష్కరించారు. సృజన వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ భూసురపల్లి వేంకటేశ్వర్లు సభను ప్రారంభించారు. సభలో తెలుగు జాతి నిలువెత్తు సంతకం బుద్ధప్రసాద్‌కు జీవిత సాఫల్య, సాహిత్య పురస్కారం అందజేశారు. కృష్ణా జిల్లారచయితల సంఘ అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు, డాక్టర్ జివి పూర్ణచందు, నాగభైరవ ఆదినారాయణ, తేళ్ళ అరుణ, డాక్టర్ గాలి గుణశేఖర్, మల్లికార్జునరావు, డాక్టర్ నూనె అంకమ్మరావు, కుర్రా ప్రసాదు, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, డివిఎం సత్యనారాయణ, డాక్టర్ యు దేవపాలన, మన్నం త్రిమూర్తులు, శేష తల్ప శాయి, మహమ్మద్ రఫి, అనంతు నాగేశ్వరరావు, పాలపర్తి జ్యోతిష్మతి, జాగర్ల మూడి శ్రీలక్ష్మి, అద్దంకి లేవి ప్రసాదు, చిన్నిమురళీకృష్ణ, చప్పిడివీరయ్య పాల్గొన్నారు.

ఎన్‌జిఒ నేతలకు నోటీసులు ఇస్తున్న పోలీస్

ఎన్‌జిఒ నేతలకు నోటీసులు

ప్రజాశక్తి - వేటపాలెం

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు తలపెట్టిన వైనాట్ ఓపిఎస్ కార్యక్రమానికి వెళ్లకుండా ఉండేందుకు ముందస్తుగా వేటపాలెం పోలీసులు ఎన్జీవో సంఘం నేతలకు ఆదివారం 149నోటీసులు ఇచ్చారు.

రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌కు అడవులదీవి విద్యార్థులు

ప్రజాశక్తి - బాపట్ల

యూనిసెఫ్ 2023-24 విద్యా సంవత్సరంలో నిర్వహించిన స్కూలు ఇన్నోవేషన్స్ ప్రోగ్రాంలో బాపట్ల జిల్లా నిజాంపట్నం మండలం అడవులదీవి జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచారని జిల్లా సైన్స్ అధికారి ఎండి సాదిక్ విలేకరులకు ఆదివారం తెలిపారు. రాష్ట్రంలో 26జిల్లాల నుండి వివిధ అంశాలపై ఎంపికైన 27 సైన్స్ ప్రాజెక్టులను ఈనెల 28 నుండి 30 వరకు రాష్ట్రస్థాయిలో విజయవాడలో జరిగే ఇన్నోవేషన్స్ ఎంపిక కార్యక్రమంలో విజేతలను ఎంపిక చేస్తారని తెలిపారు. అడవులదీవి జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు సాధారణంగా వినియోగించే గొడుగునకు లోపల చల్లని గాలి వీచే విధంగా సోలార్ ప్యానల్స్, డిసి బ్యాటరీ శక్తితో ఫ్యాన్లు అమర్చారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన అడవులదీవి జెడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులను డిఇఒ పివిజె రామారావు, డిప్యూటి డిఇఒ జి వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం జోత్స్న అభినందించారు.

వేలిముద్రల నిర్ధారణ సాఫ్ట్‌వేర్‌కు అంతరాయం

యాప్ నిర్వహణ ఛార్జీలు చెల్లించక నిలిచిన వైనం

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

అర్ధరాత్రి వేళ రోడ్లపై అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులపై రాష్ట్ర పోలీసు శాఖ దృష్టి సారించింది. వారిలో పాత నేరస్థులు, పోలీసుల నుంచి తప్పించుకు తిరుగుతున్న నేరగాళ్లు ఉంటే వెంటనే అరెస్టు చేసేలా వేలిముద్రలను సేకరిస్తోంది. పాత నేరస్థుల జాబితాతో వెంటనే పోల్చి చూసే హ్యాండ్‌హెల్డ్ డివైజ్‌లతో.. పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న వారి ఆటను కట్టిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ గస్తీ వ్యవస్థ మొదలై కొన్ని నెలలకే సాఫ్ట్‌వేర్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వివరాల్లోకి వెళితే.. కొంత కాలం కిందట మార్కాపురం పట్టణంలోని ఓ ఇంటిలో దొంగలుపడి నగదు, బంగారు ఆభరణాలు తస్కరించిన కేసులో అక్కడ లభించిన వేలిముద్రల ఆధారంగా నిందితులను పోలీసులు రోజుల వ్యవధిలోనే పట్టుకొని జైలుకు తరలించారు. రాత్రి వేళల్లో జోరుగా పోలీసుల ఈ మొబైల్ సెక్యూరిటీ గస్తీ ఏర్పాటు చేసుకొని ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతుంటే మొబైల్ గస్తీ పోలీసులు వారిని విచారిస్తారు. ఇంకా అనుమానంగా ఉంటే వేలిముద్రలను సేకరిస్తారు. వెంటనే పాత నేరస్థుల చిట్టాతో వాటిని పోల్చిచూస్తారు. అలాగే దొంగలు, దోపిడీ, హత్య, అత్యాచారాలు తదితర నేరాల్లో నిందితులను గుర్తించడానికి సంఘటనా స్థలంలో లభించిన వేలిముద్రలు, ఏదైనా నేరం జరిగిన వెంటనే వేలిముద్రల (ఫింగర్ ప్రింట్) విభాగ నిపుణులు ఘటనాస్థలంలోని వేలిముద్రలను సేకరిస్తారు. వాటిని గతంలో నేరాలకు పాల్పడిన వారి వేలిముద్రలతో పోల్చి చూస్తారు. దీంతో

యాప్ ద్వారా అనుమానితుల వేలిముద్రలు సేకరిస్తున్న పోలీసులు (పాత చిత్రం)

నేరస్థులు పక్క జిల్లాలు, ఇతర రాష్ట్రాలకు పారిపోయినా, వేషం, భాష మార్చి తిరుగుతున్నా వారి వేలిముద్రలు పట్టించేస్తాయి. అనేక సంచలనాత్మక కేసుల్లో నేరస్థులను త్వరగా గుర్తించడంలోనూ వేలిముద్రలు కీలకంగా ఉపయోగపడతాయి. అందుకోసం అన్ని స్టేషన్లలో జేబు దొంగల నుంచి తీవ్ర నేరాల కేసుల్లో అరెస్టు చేసిన నిందితుల వేలిముద్రలను పోలీసులు సేకరిస్తుంటారు. అలా సేకరించిన వేలిముద్రలను అధికారులు ఎప్పటికప్పుడు ఆ స్టేషన్లలోని కంప్యూటర్‌లో నిక్షిప్తం చేస్తారు. వాటిని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉపయోగించుకునేలా వారి కేసులకు సంబంధించిన నేరస్థులను గుర్తించడానికి వీలుగా ఓ సంస్థ సాఫ్ట్‌వేర్‌తో పాటు పలు పరికరాలను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసి పోలీస్ శాఖకు అప్పగించింది.

దీంతో లా అండ్ ఆర్డర్‌లో ఉండే ప్రతి ఒక్కరూ ఈ సాఫ్ట్‌వేర్‌ను తమ చరవాణిలో నిక్షిప్తం చేసుకొని (మొబైల్ సెక్యూర్టీ చెక్ డివైజ్) రాత్రి వేళల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వారి వేలిముద్రలను పరిశీలించడానికి పోలీసులకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

కేసులు ఛేదించడంలో జాప్యం

మంగళగిరిలోని శాఖ ప్రధాన కార్యాలయంలో ఆ సాఫ్ట్‌వేర్‌ను సీఐడీ పోలీసుల ఆధీనంలో పర్యవేక్షిస్తున్నారు. వార్షిక నిర్వహణ ఖర్చు చెల్లించాలని ఆ సాఫ్ట్‌వేర్ రూపొందించిన సంస్థ 2022 సెప్టెంబర్ నెలలో రాష్ట్ర ప్రభుత్వానికి సూచించినా పాలకులు అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో దానిని అప్‌డేట్ చేయలేదు. ఫలితంగా 2023 ఆగస్టు మొదటి వారం నుంచి సదరు సాఫ్ట్‌వేర్ సంస్థ పూర్తిగా నిలిపివేయడంతో వేలిముద్రల విభాగం నిపుణులు తలలు పట్టుకుంటున్నారు. ఉన్నతాధికారులతో సమస్యను పరిష్కరించాలని చెప్పలేక లోలోపల మదనపడుతున్నారు. ఇది పనిచేయక కీలకమైన అనేక కేసుల ఛేదన ఆలస్యం అవుతోందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. దీంతో రూ.కోట్ల విలువైన సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన పరికరాలు పాడైపోతున్నాయనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.

ఇప్పటికైనా రాష్ట్ర ప్రభ్వుతం, సీఐడీ ఉన్నతాధికారులు స్పందించి సాఫ్ట్‌వేర్‌ను వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నదని విచారణాధికారులు అభిప్రాయపడుతున్నారు.

మంచి సమాజ నిర్మాణమే మానవత ధ్యేయం

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండలోని స్మార్ట్ జన్ గ్లోబల్ స్కూల్‌లో ఆదివారం మానవత సంస్థ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో స్మార్ట్‌జన్ గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపాల్ శాస్త్రి మాట్లాడుతూ మానవత సంస్థ కార్యక్రమంల ఇక్కడ జరగడం ఆనందంగా ఉందని పేర్కొ న్నారు. కోటపాటి నారాయణ మాట్లాడుతూ ఇంకా ఎక్కువ మంది సభ్యులుగా చేరి సంస్థ కార్యక్రమాలను ముందుకు తీసుకుపోవాలని కోరారు. స్మార్ట్‌జన్ స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ ఎన్ గీతారాణి మాట్లాడుతూ మానవ చరమాంకంలో అంతిమ భాగమైన మరణం సంభవించినపుడు దూరం నుంచి బంధువులు వచ్చే వరకు శవాన్ని జాగ్రత్త చేయలేని వారికి పూర్తి ఖర్చుతో మార్చురీ బాక్సులను సమకూర్చడం, పేదలకు వివిధ సహాయ కార్యక్రమాలు అందించడం లాంటివి చేయడం నిజంగా అభినందనీయమని అన్నారు. నిజంగా ఉన్నత స్థాయిలో ఉద్యోగ విరమణ చేసిన వ్యక్తులు ఈ కార్యక్రమాలకు కేంద్ర బిందువులు కావడం సంతోషదాయకమని వారికి

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఎన్ గీతారాణి

అభినందనలు తెలియజేశారు. జన విజ్ఞాన వేదిక నాయకులు డాక్టర్ బి హరిబాబు మాట్లాడుతూ ప్రతి వ్యక్తి తన సంక్షేమం మాత్రమే కాకుండా కొంత సమాజ హితం కోసం పాటుపడాలని కోరారు. మండల విద్యా శాఖ అధికారి బి శివన్నారాయణ మాట్లాడుతూ సమాజానికి సహకారాన్ని అందించేందుకు మానవత చక్కని ప్లాట్‌ఫారమని అన్నారు. స్మార్ట్ జన్ స్కూల్ ఛైర్మన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యావంతులైన మేధావులతో కలిసి పనిచేసేం దుకు పేబ్యాక్ టు సొసైటీలో తాము కూడా భాగస్వాములం అవుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జట్టి సూర్య, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'విశ్వకర్మ'కు దరఖాస్తులు చేసుకోవాలి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ప్రధానమంత్రి ప్రవేశపెట్టిన విశ్వకర్మ పథకానికి అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు చెన్నుపల్లి శ్రీనివాసాచారి పిలుపునిచ్చారు. సంఘ సమావేశం ఆదివారం స్థానిక అంజయ్యరోడ్డులోని సంఘం ఆరామక్షేత్రంలో జరిగింది. ఈ కార్యక్రమానికి చెన్నుపల్లి శ్రీనివాసాచారి అధ్యక్షత వహించి మాట్లాడారు. బీసీ కులాలలో సాంప్రదాయ చేతి వృత్తుల వారికి ఆధునిక టెక్నాలజీ అందించి, సాంకేతిక శిక్షణ ఇచ్చి, బ్యాంకు ద్వారా ఆర్థిక సాయం అందించడం కోసం విశ్వకర్మ అనే పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. ఈ పథకానికి సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. సెప్టెంబర్ 17న విశ్వకర్మ జయంతి సందర్భంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతందని తెలిపారు. సాంప్రదాయ చేతి వృత్తుల్లో జీవనం సాగిస్తున్న అర్హులైన విశ్వబ్రాహ్మణులందరూ దరఖాస్తు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఒంగోలుకు చెందిన వడ్లమాని వీరబ్రహ్మాచారి అనారోగ్యంతో మరణించడంతో వారి కుటుంబానికి రూ.25,500 ఆర్థిక సాయాన్ని వీర బ్రహ్మాచారి భార్య భవానికి సమావేశంలో అందజేశారు. సమావేశంలో సంఘం నాయకులు ఫణిదపు సుధాకర్, గోనుగుంట బ్రహ్మేంద్ర కుమార్, పొన్నపల్లి బ్రహ్మానందం, వినుకొండ శ్యామల, బొగ్గవరపు వెంకటేశ్వర్లు, ఏల్చూరి హేమంత్‌కుమార్, వినుకొండ మల్లిఖార్జునచారి, ఆచారపు రాఘవచారి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయమందిస్తున్న విశ్వబ్రాహ్మణులు

శిద్దా సుధీర్‌కుమార్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి-దొనకొండ

తిరుమల తిరుపతి దేవస్థానం నూతన పాలకమండలి సభ్యుడిగా నియమితులైన మాజీ మంత్రి శిద్దా రాఘవరావు తనయుడు, యువ పారిశ్రామికవేత్త శిద్దా సుధీర్‌కుమార్‌ను దొనకొం డకు చెందిన శిద్దా యూత్ ఫోర్స్, మాజీ మండ ల కోప్షన్ సభ్యుడు షేక్ గౌస్‌బాషా నేతృత్వంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఉప్పుటూరి కృష్ణారావు, చందోలు మణికంఠ, పఠాన్ లతీఫ్‌సేట్, చీతిరాల రామయ్య తదితరులు ఒంగోలులోని ఆయన నివాసానికి వెళ్లి భారీ గజమాల వేసి శుభాకాంక్షలు తెలిపారు.

శిద్దా సుధీర్‌ను భారీ గజమాలతో సన్మానిస్తున్న దొనకొండ శిద్దా యూత్

తూనికల్లో మోసాలను అరికట్టాలి

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి పట్టణంలో పలు దుకాణాల్లో తూనికలు కొలతల్లో జరిగే మోసాలను అరికట్టాలని వినియోగదారుల రక్షణ సమితి పొదిలి మండల అధ్యక్షులు ధర్నాసి రామారావు అన్నారు. ఆదివారం వినియోగదారుల రక్షణ కమిటీ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సినిమా థియేటర్లలో అధిక ధరలకు టికెట్ల అమ్మకాలను నివారించాలన్నారు. అదే విధంగా పౌర సరఫరాల శాఖ అందించే నిత్యావసర వస్తువుల్లో నాణ్యత పెంచాలని సూచించారు. పట్టణంలో కలుషిత నీటి సరఫరాపై ఆ శాఖ అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కోరుతూ తీర్మానం చేశారు. కమిటీ బలోపేతం నూతన కమిటీ ఏర్పాటుపై చర్చించారు. ఈ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి జేబి షా, జాయింట్ సెక్రెటరీ జహంగీర్ బాషా, కార్యవర్గ సభ్యులు భూమా రాంబాబు, కే సత్యనారాయణ చౌదరి, రెహమాన్, సి హెచ్ సుబ్బారావు, మజున్ షా, ఏం నరసింహారావు, మదార్‌వలి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ధర్నాసి రామారావు

పిసిపల్లి ఎస్ఐగా మాధవరావు

ప్రజాశక్తి-పిసిపల్లి

పిసిపల్లి ఎస్ఐగా మాధవరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు పోలీస్ స్టేషన్ సిబ్బంది ఘనస్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాధవరావు మాట్లాడుతూ మండలంలో పేకాట, బెల్టుషాపులపై ఉక్కుపాదం మోపుతానన్నారు. మండలంలో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కామూరి వారి రాజన్న నిత్య భోజనశాల

రాజన్న భోజనశాల ప్రారంభం

ప్రజాశక్తి-కొమరోలు

ప్రకాశం జిల్లా కొమరోలు మండలంలో వైసీపీ నాయకులు కామూరి రమణారెడ్డి ఆధ్వర్యంలో రాజన్న భోజనశాల ఆదివారం ప్రారంభమైంది. మండల రెవెన్యూ ఆఫీసు దగ్గరలోని తన నివాసంలో నూతన భవనాన్ని నిర్మించి దానికి రాజన్న భోజనశాల అని నామకరణం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైసీపీ నాయకులు, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, మాగుంట శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. వీరిని మొదటగా హెల్ప్ యాడ్ పూలవర్షంతో ఆహ్వానించారు. అక్కడి నుంచి పట్టణంలోని ఆంజనేయ స్వామి గుడి దగ్గర గజమాలతో వైసిపి నాయకులు సత్కరించారు. అనంతరం నూతన రాజన్న భోజనశాలను రిబ్బన్ కట్ చేశారు. తర్వాత వైసీపీ నాయకులు కామూరి రమణారెడ్డి నూతన గృహప్రవేశం చేశారు. తదనంతరం నాయకులకు, ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఉద్యోగోన్నతిపై పశుసంవర్ధక శాఖ ఏడి బదిలీ

ప్రజాశక్తి-మద్దిపాడు

మండల కేంద్రమైన మద్దిపాడు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ పి రామారావు ఉద్యోగన్నతిపై బదిలీ వెళ్తున్నారు. గత నాలుగు సంవత్సరాల నుంచి ఈ ప్రాంత రైతులకు ఆయన విశేష సేవలు అందించారు. ఎందరో అభిమానాన్ని చూరగొన్నారు. పల్నాడు జిల్లా నరసరావుపేట శాఖ ఉపసంచాలకులుగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుతం మద్దిపాడు ఇన్‌ఛార్జి ఏడిగా డాక్టర్ బి బసవ శంకరరావును నియమించారు.

డాక్టర్ పి రామారావు

గ్రంథాలయంలో చదువుకుంటున్న విద్యార్థులు, పాఠకులు

పుస్తక పఠనంతో విజ్ఞానం

ప్రజాశక్తి-కొండపి

విద్యార్థులు పుస్తకాలు చదవడం వలన విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునని గ్రంథపాలకుడు బి కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పాఠశాల సెలవు దినాలలో గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు చదువుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు తదితరులు ఉన్నారు.

సంక్షేమమే కాదు.. అభివృద్ధి కూడా

ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలందరూ బాగుండాలన్నదే లక్ష్యమని, అందుకు అనుణంగా వివక్షలేని పాలన సాగిస్తున్నారని మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి అన్నారు. మార్కాపురం మున్సిపాలిటీలోని 28వ వార్డులో ఆదివారం సాయంత్రం ఆ వార్డు కౌన్సిలర్ షేక్ కరీమూన్ అధ్యక్షతన జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజలతో మాట్లాడారు. అందుతున్న పథకాలపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి మాట్లాడారు. పథకాలే కాదు... అభివృద్ధి పనులు కూడా జరుగుతున్నాయని వివరించారు. మార్కాపురం ప్రాంతంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణంలో ఉందని, వెలిగొండ ప్రాజెక్టు త్వరలో ప్రారంభం కానుందని, ఈ విధంగా అభివృద్ధిలో మార్కాపురం ప్రాంతం మరింతగా దూసుకుపోతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు షేక్ ఇస్మాయిల్, సిహెచ్ అంజమ్మ శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు షేక్ చిన్న పెద్దావలి, కొత్త కృష్ణ, సిరాజ్, దొడ్డా భాగ్యలక్ష్మి, డి హర్షిత బాబి, షేక్ నాసర్‌వలి, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు గుంటక వనజాక్షి చెన్నారెడ్డి, సయ్యద్ ఆబిదా ఖాశిం, పఠాన్ అమీరుల్లాఖాన్, వైసిపి నాయకులు బొగ్గరపు శేషగిరిరావు, ముత్తారెడ్డి వెంకటరెడ్డి, జె నాగిరెడ్డి, రహంతుల్లా, ఆసిఫ్‌ఖాన్, మున్సిపల్ డిఇ షేక్ సుభాని, శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ నాయబ్‌రసూల్ తదితరులు పాల్గొన్నారు.

'గడప గడపకూ'లో ప్రజలతో ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

విద్యుత్ సర్వీసులకు ఆధార్ అనుసంధానం

ప్రజాశక్తి-కొండపి

విద్యుత్ సర్వీస్ నెంబర్లకు ఆధార్ కార్డు నెంబర్ అనుసంధానం చేసే కార్యక్రమం ఏపిసిపిడిసిఎల్ పరిధిలో జరుగుతుందని కొండపి విద్యుత్ శాఖ ఏఈ కుంచాల కోటయ్య తెలిపారు. మండలంలోని అన్ని సచివాలయాల్లో కరెంటు సర్వీస్ నెంబర్‌కు ఆధార్ కార్డు నెంబర్ లింకు చేస్తున్నారని తెలిపారు. సచివాలయానికి వెళ్లేటప్పుడు మీ వెంట కరెంటు బిల్లు, సర్వీస్ ఎవరి పేరు మీద ఉండో వారి ఒరిజినల్ ఆధార్ కార్డు సంతకంతో జిరాక్స్ కాపీ తీసుకొని వెళ్లాలన్నారు. సర్వీసు తీసుకున్న అతను చనిపోతే వారి మరణ ధృవీకరణ పత్రంతోపాటు ఆ ఇంట్లో ఎవరు ఉంటున్నారో వారి ఆధార్ కార్డు తీసుకొనిపోవాలని సూచించారు.

పోటాపోటీగా వేడుకలు

ప్రజాశక్తి-కొమరోలు

కొమరోలు ప్రాంతంలో అప్పుడే ఎలక్షన్‌ల హడావుడి మొదలైనట్టు కనిపిస్తోంది. ఎలక్షన్లకు దాదాపు 9 నెలలు సమయం ఉండగానే నాయకులు ఎలక్షన్లు వచ్చేసినట్లుగా హడావుడి చేసేస్తున్నారని, వైసీపీ ఎమ్మెల్యే సీటు ఎవరికి ఇస్తారో అని కార్యకర్తలలో ఉత్కంఠ మొదలైంది. గత నెల చేరెడ్డి వెంకటేశ్వరరెడ్డి తన మనవడి పుట్టినరోజు వేడుకను భారీగానే హడావిడి చేశారు. అలాగే సిట్టింగ్ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పుట్టినరోజు వేడుకలలో బల ప్రదర్శన చేశారు. ఇప్పుడు కామూరి రమణారెడ్డి తన నూతన గృహ ప్రవేశ కార్యక్రమం, నూతన రాజన్న భోజనశాల ప్రారంభోత్సవాలు చేశారని, రేపు ఇంకెవరు ఇలాంటి బల ప్రదర్శనలు చేస్తారో అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

బస్సు యాత్రను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-దరిశి

రాష్ట్రాన్ని రక్షించండి-దేశాన్ని కాపాడండి అనే నినాదంతో సిపిఐ ఆధ్వర్యంలో జరిగే బస్సు యాత్రను జయప్రదం చేయాలని సిపిఐ దరిశి నియోజకవర్గ కార్యదర్శి మాడపాకుల రమేష్‌బాబు అన్నారు. ఆదివారం స్థానిక గుజ్జుల సరళాదేవి భవనంలో బస్సు యాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ నెల 17న విశాఖపట్టణంలో ప్రారంభమైన బస్సు యాత్ర సెప్టెంబరు 8న తిరుపతిలో భారీ బహిరంగసభతో ముగుస్తుందన్నారు. 28, 29 తేదీలలో కనిగిరిలో జరిగే బస్సుయాత్రను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు హనుమంతరావు, జూపల్లి కోటేశ్వరరావు, కరుణానిధి, చిన్నఆంజనేయులు పాల్గొన్నారు.

జీతాలు లేక ఇబ్బందులు

ప్రజాశక్తి-దరిశి: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఎంఇఒ-2లు, ప్లస్-2 టీచర్లకు మూడు నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కీర్తి అన్నారు. ఆదివారం స్థానిక సబ్‌ట్రెజరీ కార్యాలయం వద్ద ఎపిటిఎఫ్ అధ్యర్వంలో నిరసన తెలిపారు. జిఒ నెం 117ను రద్దు చేయాలని కోరారు. మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె వెంకటేశ్వరరావు, శ్రీనివాసులు, జిల్లా బాధ్యులు వెంకటేశ్వర్లు, గురులింగం, విక్రం నాగార్జున, సీనియర్ నాయకులు బాలాజీ, పీరుసాహెబ్, అట్లూరి రామారావు పాల్గొన్నారు.

నేటి నుంచి డిగ్రీ రిజిస్ట్రేషన్లు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో బిఎస్‌సి, మ్యాథ్ మ్యాటిక్స్, బాటనీ, బికాం, కంప్యూటర్ అప్లికేషన్స్, బిఎ, హిస్టరీ మేజర్ సబ్జెక్టులకు 2023-24 విద్యా సంవత్సరానికి గాను రెండవ విడత ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు ఈ నెల 28వ తేదీ నుంచి సెప్టెంబర్ ఒకటో తేది వరకు జరుగుతాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి శ్రీధర్ నాయుడు ఆదివారం తెలిపారు. సెప్టెంబర్ 4వ తేదీ నుంచి 8వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చని చెప్పారు.

గ్రంథాలయంలో 'చదవడం నాకిష్టం'

ప్రజాశక్తి-టంగుటూరు: స్థానిక పంచాయతీ కార్యాలయం పక్కన గల గ్రంథాలయంలో ఆదివారం 'చదవడం నాకిష్టం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథ పాలకుడు గుమ్మడి వర్ధనరాజు మాట్లాడుతూ ప్రతి ఆదివారం గ్రంథాలయాల్లో నిర్వహించే చదవడం నాకిష్టం కార్యక్రమానికి విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరవుతున్నారన్నారు. విద్యార్థులు గ్రంథాలయాల్లోని కొత్త కొత్త పుస్తకాలు వెతికి మరీ చదువుకోవడం ఎంతో సంతప్తినిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

క్రీడలను ప్రారంభిస్తున్న పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాస్

ఆరోగ్యం కోసం క్రీడలు అవసరం

ప్రజాశక్తి-మార్కాపురం

ఉద్యోగులు మానసిక ఒత్తిడి నుంచి బయటపడి ఆరోగ్యంగా ఉండేందుకు క్రీడలు అవసరమని మార్కాపురం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 21 నుంచి 29వ తేదీ వరకు నేషనల్ స్పోర్ట్స్ డేను పురస్కరించుకుని తపాలా శాఖలో సిబ్బందికి స్పోర్ట్స్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మార్కాపురంలోని తపాలా ఉద్యోగులకు ఆదివారం నాడు 5కె రన్, 3కె రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ శ్రీనివాస్ మాట్లాడుతూ తపాలా ఉద్యోగుల్లో ఉత్సాహాన్ని, ఆరోగ్యాన్ని ఉల్లాసంగా నింపేందుకు ఈ క్రీడలు దోహదపడతాయన్నారు. క్యారమ్, చెస్, బ్యాడ్మింటన్, క్రికెట్ తదితర పోటీలు కూడా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ మదనమోహన్, పోస్టుమాస్టర్ సయ్యద్ సుభాని, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు వంటసామగ్రి అందజేత

ప్రజాశక్తి-చీమకుర్తి

స్థానిక ఎన్ఎస్ కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చీమకుర్తి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వంట సామగ్రి అందజేశారు. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ బి జవహర్, అధ్యక్షులు చలువాది బదరీ నారాయణ అందజేశారు. నిత్యావసర వస్తువులను నూనె హేమసుందరావు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఎస్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి చీమకుర్తి లయన్స్‌క్లబ్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. మౌలిక వసతుల కల్పనలో క్లబ్ సభ్యులు చొరవ మరువలేనిదన్నారు. డాక్టర్ బి జవహర్, చలువాది బదరీ నారాయణ మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జె యాకోబు, లయన్స్‌క్లబ్ కార్యదర్శి చలువాది రమేష్, నూనె హేమసుందరరావు, ఉపాధ్యాయులు బి ఏసుదాసు, అంజిరెడ్డి పాల్గొన్నారు.

క్రీడా వికాస కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా వికాస కేంద్రాన్ని క్రీడాకారులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా వికాస కేంద్రం అభివృద్ధి కమిటి చైర్మన్ నరెడ్డి వెంకటరెడ్డి ఆదివారం తెలిపారు. ఉదయం 4 గంటల నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు క్రీడా వికాస కేంద్రం అందుబాటులో ఉంటుందన్నారు.

దాని నిర్వహణ కోసం నెలకు రూ.300 చొప్పున మూడు నెలలకు రూ.800లు, ఆరు నెలలకు రూ.1600, తొమ్మిది నెలలకు రూ.2400, సంవత్సరంనకు రూ.3 వేలు రుసుంగా నిర్ణయించి వసూలు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ సహకారంతో క్రీడా వికాస కేంద్రంలో మరిన్ని క్రీడా సామాగ్రి, సౌకర్యాలను కల్పించనున్నట్లు చెప్పారు.

వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు, రోగులు

ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-కంభం రూరల్

కంభం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత రక్తనాళాల వైద్య పరీక్ష శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉచిత వైద్య శిబిరాన్ని సీనియర్ సభ్యులు, వాసవి విద్యాసంస్థల అధినేత గోళ్ల సుబ్బరత్నం ప్రారంభించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాల చైర్మన్ జాకీర్ హుస్సేన్, క్లబ్ అధ్యక్షుడు మహబూబ్ బేగ్ మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతంలో వెరికోసిస్ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా అధునాతన వైద్య పరీక్షలతో పాటు అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు చేయడం మంచి పరిణామమని చెప్పారు. అనంతరం హైదరాబాదుకు చెందిన ఏషియన్ వేస్కులర్ హాస్పిటల్ నుంచి వచ్చిన వైద్య బృందం ఆధ్వర్యంలో 105 మందికి ఉచిత రక్త నాళాల వైద్య పరీక్షను నిర్వహించారు. వారిలో 18 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. వీరి అనుమతి, ఆసక్తిని బట్టి అతి త్వరలో హైదరాబాదులో లేజర్ వెరికోస్ సర్జరీ ఉచితంగా చేయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెక్రటరీ విఠా వెంకట శ్రీనివాసరావు, ట్రెజరర్ తన్నీరు బాల రంగా రావు, క్లబ్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ పులి శ్రీనివాస ప్రసాద్, లయన్ సభ్యులు పేర్లి గుండయ్య, అత్తర్ షేక్ హుస్సేన్(దాదా), హజరత్ గూడెం సర్పంచ్ షేక్ మహబూబ్ పీరా, రంగా, చౌదరి, రోషన్ తదితరులు పాల్గొన్నారు.

ఓ ఇంటిలో నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే డోలా, సత్య తదితరులు

గృహ ప్రవేశ వేడుకలో ఎమ్మెల్యే స్వామి, సత్య

ప్రజాశక్తి-కొండపి

కొండపి మండలంలో వివిధ గ్రామాలలో పలు కార్యక్రమాల్లో కొండపి శాసనసభ్యులు డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య పాల్గొన్నారు. కొండపి గ్రామంలోని బూదవాటి సోమయ్య గృహ ప్రవేశ కార్యక్రమం, కల్లగుంట రమణయ్య ఆరోగ్య పరిస్థితి బాగలేకపోవడంతో వారిని పరామర్శించారు. కట్టావారిపాలెం గ్రామానికి చెందిన రావెళ్ల సుబ్బరత్నమ్మ దశదిన కార్యక్రమంలో పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అలాగే కె ఉప్పలపాడు గ్రామంలో టీచర్‌గా పనిచేస్తున్న పాలేపు మల్లిఖార్జునరావు మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా నాయకురాలు రావిపాటి సీతమ్మ, ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షులు గొర్రెపాటి రామయ్య చౌదరి, మండల పార్టీ అధ్యక్షులు బి యలమందనాయుడు, బత్తుల నారాయణస్వామి, నరసారెడ్డి, మండల యూత్ అధ్యక్షులు కాలేషా, నేతి రవికుమార్, కాశయ్య, దేపూరి మస్తాన్, చింతల వెంకటరావు, పోకూరి సుధాకర్, గోగినేనివారిపాలెం సర్పంచ్ కొమ్మాలపాటి లచ్చేర్రు, బొద్దులూరి మోహన్, కొమ్మాలపాటి రమణయ్య, రావెళ్ల రఘునాథ బాబు, మండలంలోని నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి - బాపట్ల

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 30 నుండి సెప్టెంబరు 4వరకు నిరసన చేపట్టనున్నట్లు సిపిఎం పట్టణ కార్యదర్శి భోగిరెడ్డి తెలిపారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య ప్రజాసంఘాల కార్యాలయంలో నిరసన కార్యక్రమాల గోడ పత్రికను ఆవిష్కరించారు. విద్యుత్ చార్జీలు, పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు నియంత్రించడంలో ప్రభుత్వాలు పూర్తి విఫలమయ్యాయని అన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని కేంద్రప్రభుత్వం, లక్షల్లో ఉద్యోగాలు కల్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వం చేసిన వాగ్దానాలు గాలికి వదిలేశాయని అన్నారు. కొత్తగా ఉద్యోగాలు ఇవ్వకపోగా ఉన్న ఉద్యోగాలు పీకేస్తున్నారని అన్నారు. అదాని అంబానీకి మాత్రం లక్షల కోట్లల్లో రాయితీలు ఇస్తూ కుటీర పరిశ్రమలను కుదేలయ్యేలా పన్నులు వేస్తున్నారని అన్నారు. సిపిఎం ప్రచార ఆందోళనల్లో నిరుద్యోగులు, మహిళలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో

పోస్టర్ ఆవిష్కరిస్తున్న భోగిరెడ్డి

సిపిఎం నాయకులు ఎన్ కోటేశ్వరావు, వై భాస్కం రావు, కె నాగేశ్వరరావు, సామేలు, కుమార్, వై శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేపల్లె : అధికధరలు నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న సమరభేరిని జయప్రదం చేయాలని కోరుతూ సీపీఎం కార్యలయంలో పోస్టర్స్ ఆవిష్కరించారు. సిపిఎం పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి వల్ల ధరలు పెద్ద ఎత్తున పెరుగుతున్నాయని అన్నారు. రూ.400 ఉన్న గ్యాస్ సిలిండర్ ఇప్పుడు రూ.1200కు చేరిందన్నారు. సాధారణ ప్రజలు కొనలేని పరిస్థితికి గ్యాస్ ధరలు పెరిగాయన్నారు. నిత్యావసరాలు పెరిగి

పోస్టర్ ఆవిష్కరిస్తున్న తలపనేని రామారావు

సామాన్యులు బ్రతకలేని స్థితి ఏర్పడిందన్నారు. ఆగస్ట్ 30, 31తేదీల్లో కరపత్రాల పంపిణీ, సెప్టెంబర్ 1న సచివాలయ వద్ద ధర్నాలు, విద్యుత్ బిల్లుల దగ్ధం, 3న నిరుద్యోగ సమస్యపై నిరసనలు, 4న మండలం వద్ద ధర్నాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె ఆశీర్వాదం, కెవి లక్ష్మణరావు, కె రమేష్ పాల్గొన్నారు.

పంగులూరు : నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలనీ, ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భక్తి చేయాలని ,కరెంటు చార్జింగ్ తగ్గించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సిపిఎం నిర్వహించనున్న సమరభేరి పోస్టర్‌ను సిపిఎం నాయకులు ఆదివారం ఆవిష్కరించారు. ఆగస్టు 30 నుండి, సెప్టెంబర్4 వరకు సమరభేరి జరుగుతుందని సిపిఎం మండల కార్యదర్శి తలపనేని రామారావు తెలిపారు. జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటికి ఏడు సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారని అన్నారు. నెలవారీ చార్జీలు పెంచేందుకు రంగం సిద్ధం చేస్తున్నాడని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం కమిటీ సభ్యులు గుడిపాటి మల్లారెడ్డి, పూసపాటి సుబ్బరాజు, తలపనేని సుబ్బారావు పాల్గొన్నారు.

సమరభేరి పోస్టర్లు ఆవిష్కరణలో సిపిఎం నేతలు

భట్టిప్రోలు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన నిత్యావసర ధరలను నిరసిస్తూ సిపిఎం అధ్యర్యంలో చేపట్టిన సమరబెరి ని పోస్టర్లను సిపిఎం బాపట్ల జిల్లా కమిటీ సభ్యులు టి కృష్ణమోహన్ ఆవిష్కరించారు. ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశానికి సిపిఎం భట్టిప్రోలు కార్యదర్శి మురుగుడు సత్యనారాయణ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి జి సుధాకర్, జి నాగరాజు, కె రామస్వామి ఉన్నారు.

శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - నగరం

సమరసత సేవా ఫౌండేషన్ బాపట్ల మండలాల కన్వీనర్ల శిక్షణా తరగతులు నగరం శ్రీగిరిపురం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థాన కళ్యాణ మంటపంలో ఆదివారం జరిగాయి. పోలగంగు శ్రీనివాసరావు మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని కాపాడటానికి గ్రామ ధార్మిక సమితి సభ్యులు కృషి చేయాలని కోరారు. హిందూ ధర్మం గొప్పతనం తెలియజెప్పే వారు లేక కొంత మంది అన్యమతం స్వీకరిస్తున్నారని అన్నారు. అన్యమతంలోకి వెళ్ళకుండా చూడాలని తెపారు. కార్యక్రమంలో బాలవికాస్ జిల్లా కన్వీనర్ యల్లాప్రగడ సీతాపతి, మహిళ విభాగం జిల్లా కన్వీనర్ బొలగాని విజయ లక్ష్మీ, సబ్ డివిజన్ కన్వీనర్లు క్రాప రవి కుమార్, యడ్లపల్లి శివనాగమల్లేశ్వర రావు, సుజాత, పేరం కోటేశ్వరరావు, యార్లగడ్డ చింతయ్య, ధర్మ ప్రచారక్‌లు జంజనం హేమశంకరరావు, అక్కల సుబ్బారెడ్డి, కౌతరపు సాయిచంద్ర పాల్గొన్నారు.

ప్రమాదాలకు కారణమైన అడ్డరోడ్డు జంక్షన్

ప్రమాదకరంగా 'జంక్షన్'

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని పుట్టావారిపాలెం అడ్డ రోడ్డు జంక్షన్ ప్రమాదకరంగా మారింది. ఈ జంక్షన్ గుండా గుంటూరు, కర్నూలు, చెన్నై, హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాల తో నిత్యం రద్దీగా ఉంటుంది. వేగనిరోధకా లు బలంగా లేనందున వాహనాలు అతివేగంగా వెళుతున్నాయి. ప్రక్క ప్రక్కనే ఢీ కొంటున్నాయి. ప్రమాదాల్లో కొందరు క్షతగాత్రులౌతుంటే మరికొందరు మృత్యువాత పడుతున్నారు. ఒంగోలు, గుంటూరు, హైదరాబాద్, కర్నూలు వైపు వెళ్లే ప్రయాణికులు బస్సుల ద్వారా దిగుతుంటారు. ఎప్పుడు ఏమి జరుగుతుందోనని భయడతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వాహనాల అతివేగాన్ని అరికట్టే వేగనిరోధ కాలను పటిష్టంగా ఏర్పాటు చేసి ప్రమాదా లను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

అలరించిన కవి సమ్మేళనం

ప్రజాశక్తి - అద్దంకి

సృజన 27వ వార్షికోత్సవ సభ, పద్యశాసన ప్రతికృతి ఆవిష్కరణ 18వ వార్షికోత్సవ సభ స్థానిక శ్రీనివాస ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఉపసభాపతి, ప్రపంచ తెలుగు మహాసభల గౌరవాధ్యక్షుడు మండలి బుద్ధ ప్రసాద్ ముందుగా పద్యశాసనానికి, ఎర్రయ్య విగ్రహానికి, సరస్వతీ దేవి విగ్రహాలకు పూలమాలలు సమర్పించారు. సృజన వారు పద్యశాసన ప్రతికృతి ఆవిష్కరించి, పద్యాన్ని రక్షించి, పద్యానికి గొడుగు పట్టారని అన్నారు. ఈకార్యక్రమంలో పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి, డాక్టర్ జివి పూర్ణచందు, డాక్టర్ యు దేవపాలన, గాడేపల్లి దివాకర దత్తు, మన్నం త్రిమూర్తులు, వీరవల్లి రుద్రయ్య, కె అనిలకుమార సూరి, సంకా బాబు, జ్యోతి చంద్రమౌళి పాల్గొన్నారు. సృజన వార్షికోత్సవ సభలో కవిసమ్మేళనం జరిగింది. శతావధాని శ్రీమాన్ నారాయణం బాల సుబ్రహ్మణ్యం జ్యోతి ప్రజ్వలన చేశారు. కవి సమ్మేళనాన్ని ప్రముఖ కవి షేక్ కరీముల్లా ప్రారంభించారు. ఆరు ఆవృత్తాలలో 60మంది కవులు తమ కవితాగానంతో సభికులను అలరించారు. ఈ కవి సమ్మేళన ఆవృత్తాలను ప్రకాశం జిల్లా రచయితల సంఘ అధ్యక్షులు పొన్నూరి వెంకట శ్రీనివాసులు, కుందుర్తి స్వరాజ్యపద్మజ, పాలపర్తి జ్యోతిష్మతి, డాక్టర్ యు దేవపాలన, కెఎస్‌వి ప్రసాదు, వడలి, మూడమంచు వెంకటేశ్వర్లు, జివి మాల్యాద్రి, ఆర్‌వి రాఘవరావు, ఇలపావులూరి శేషతల్పశాయి నిర్వహించారు. కవిసమ్మేళనాల తర్వాత ఓ అరగంట మాట్లాడుకుందాం కార్యక్రమంలో పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి రచించిన సృజనసాహితీ వైభవం గ్రంథాన్ని గురించి సవిస్తారంగా ఆర్ రాఘవరెడ్డి ప్రసంగించారు. ఎర్రయ తర్వాత అద్దంకి కవుల సాహిత్య సృష్టి అక్షరబద్ధం కాలేదని, గత 27ఏళ్ళ సృజన సాహిత్య కృషిని అందించే అదృష్టం దక్కిందని సృజన సాహితీ వైభవం గ్రంథకర్త శ్రీరామ చంద్రమూర్తి అన్నారు.

మార్కెట్ యార్డు నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - నిజాంపట్నం

స్థానిక మార్కెట్ యార్డు నందు రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణరావు అధ్యక్షతన కూచినపూడి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా పందరబోయిన బసవపున్నయ్య, వైస్ చైర్మన్‌గా కోలసాని కోటేశ్వరరావు మరియు డైరెక్టర్లను అగ్రికల్చరల్ మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్ కె శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రమాణ స్వీకారోత్సవ సభలో రాజ్యసభ సభ్యులు, పిఎంఆర్ సీఫుడ్స్ అధినేత బీధా మస్తాన్‌రావు, మోపిదేవి వెంకటరమణారావు మాట్లాడుతూ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం ఎంతో ఆనందంగా

మాట్లాడుతున్న ఎంపీ బీద మస్తాన్‌రావు

ఉందని అన్నారు. టిడిపి హయాంలో వ్యవసాయమే దండగని చంద్రబాబు నిర్వీర్యం చేశారన్నారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా వ్యవసాయానికి పెద్దపీట వేశారని అన్నారు. రైతులకు గిట్టుబాటు ధరతో పాటు ఆర్థికంగా రుణాలు ఇచ్చి ఆదుకుంటున్నారని అన్నారు. తానొస్తే ఏదో చేస్తామని చంద్రబాబు ప్రగల్భాలు పలుకుతున్నాడని అన్నారు. చంద్రబాబుతో తనకు పాతిక సంవత్సరాల అనుబంధం ఉందని, మాటలు తప్ప చంద్రబాబు పనులేమీ చేయరని అన్నారు. పాదయాత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కుల, మత, ప్రాంత, పార్టీ తేడాలు లేకుండా అందరికీ మేలు చేస్తున్నాడని అన్నారు. ఓటు అడిగే ధైర్యం, హక్కు జగన్మోహన్‌రెడ్డి మాత్రమే ఉందని అన్నారు. ప్రజలు ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమానికి వైసిపి మండల అధ్యక్షులు వెంకట హరి నాథ్‌బాబు, జడ్పిటిసి నర్రా సుబ్బయ్య, వాసుదేవా పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

వేటపాలెం : స్థానిక రోటరీ క్లబ్, బిబిహెచ్ కాలేజీ 1992లో 10వ తరగతి పూర్వ విద్యార్థులు, జిల్లా అందత్వ నివారణ సంస్థ సంయుక్తంగా బిబిహెచ్ కాలేజీలో ఉచిత కంటి వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. శిబిరాన్ని రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ఎం సుధీర్ కుమార్ ప్రారంభించారు. శంకర ఆస్పటల్ వైద్యులు బిపిన్ రుతున్ 165మందికి శుక్లాలు ఉన్నట్లు గుర్తించారు. తక్షణం ఆపరేషన్ అవసరమైన 38మందిని వెంటనే బస్సులో శంకరా నేత్రాలయానికి తరలించినట్లు రోటరీ ప్రెసిడెం ట్ బట్ట మోహనరావు తెలిపారు. రోటరీ సెక్రటరీ సురేష్, గొల్లపూడి సీతారాం, కారంచేటి శివరామ కృష్ణ, కొత్త వాసు, నున్న నాగేంద్రరావు, పొగడదండ రవికుమార్, కదిరి భాష, టి కోటేశ్వరరావు, ప్రత్తి వెంకట సుబ్బారావు పవన్, వెంకటేశ్వర్లు,పాల్గొన్నారు.

కంట పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఎమ్మెల్యేని అభినందిస్తున్న వైసిపి నాయకులు

వైసిపి జిల్లా కోశాధికారిగా దేవేంద్ర

ప్రజాశక్తి - బాపట్ల

వైసిపి జిల్లా కోశాధికారిగా పిట్టలవానిపాలెం మండలం ఖాజీపాలెంకు చెందిన కూసంపూడి దేవేంద్రరాజు నియమితులయ్యారు. పిట్టలవానిపాలెం మండల వైసిపి నాయకులు ఎమ్మెల్యే కోన రఘుపతిని కలిసి దేవేంద్రరాజు నియామకం పట్ల ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని దేవేంద్రరాజు తెలిపారు. ఎమ్మెల్యే కోన రఘుపతి హయాంలో పార్టీని నమ్ముకున్న వారికి కచ్చితంగా తగిన గౌరవం దక్కుతుందని చెప్పారు. కార్యక్రమంలో షేక్ హుస్సేన్, లీలా శ్రీనివాసరెడ్డి, మండే విజయ్ కుమార్ పాల్గొన్నారు.

రక్త నమూనాలు సేకరిస్తున్న సిబ్బంది

వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - చీరాల

శ్రీశ్రీశ్రీ రామానందసరస్వతి ట్రస్ట్ వాడరేవు వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిభిరానికి విశేష స్పందన లభించింది. ఆదివారం నిర్వహించిన వైద్యశిభిరంలో 284మందికి వైద్యపరీక్షలు చేశారు. గత కొన్నేళ్లుగా వాడరేవు ఆశ్రమం ఆవరణలో ఉచిత షుగరు వైద్యశిభిరం నిర్వహిస్తున్నారు. పరీక్షలు చేయించుకున్న వారందరికీ నెల రోజులకు సరిపడు మందులు ఉచితంగా ఇచ్చినట్లు ఆశ్రమ మేనేజర్ నారాయణం సురేష్ తెలిపారు. శిభిరానికి హాజరైన వారికి అల్పారం ఏర్పాటు చేశారు. డాక్టర్ ఎం రాజరాజేశ్వరి, డాక్టర్ కమలారాజేశ్వరి, డాక్టర్ లలిత్‌ప్రకాష్, డాక్టర్ పేట శ్రీకాంత్, డాక్టర్ సుధాకర్ యాదవ్ వైద్యపరీక్షలు చేశారు. ట్రస్ట్ ఉపాధ్యక్షులు కె కృష్ణారావు, ఎ సురేష్, ఎంజి శంకరరావు, పి కామేశ్వరరావు, గోపాల్, కుమార్ రోగులకు ఆహారం, తాగునీటి వసతుల ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సిమెంటు రోడ్లపై దమ్ము ట్రాక్టర్లతో రోడ్లకు పగుళ్లు

దమ్ము ట్రాక్టర్లతో దెబ్బతింటున్న రోడ్లు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యత కలిగన ట్రాక్టర్లు వరిపొలాలను సిద్ధం చేయడానికి దమ్ము చక్రాలతో రోడ్లపై తిరుగుతున్నాయి. ఇనుప చక్రాలతో వెళ్లే ట్రాక్టర్ల దెబ్బకు సిమెంటు రోడ్లు సైతం దెబ్బతింటున్నాయి. లక్షలు ఖర్చుచేసి వేసిన రోడ్లు పధికాలల పాటు పదిలంగా ఉంటాయనుకుంటే దమ్ము ట్రాక్టర్ల రాకపోకలతో రోడ్లు పగిపోయి పతిష్ఠను కోల్పోతున్నాయి. రోడ్లను సంరక్షించేందుకు అధికారులు రైతులకు సూచనలు చేశారు. ఇనుప చక్రాలకు ఇనుప రేకుతో తొడుగు తయారు చేయించుకోవాలని సూచించారు. ట్రాక్టర్ పొలాలకు బయలుదేరే ముందు ఆ తొడుగును తగిలించి రహదారులపై వెళ్లాలని తెలిపారు. కానీ ఆ నిబంధన ఏ ఒక్కరు పాటించటం లేదు. దీంతో రహదారులు గాళ్ళు పడి దెబ్బతింటున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు పట్టి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టి రహదారులు దెబ్బతినకుండా చూడాలని కోరుతున్నారు.

దళితులపై దాడులను అరికట్టాలి

ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి. రమాదేవి

ప్రజాశక్తి-దర్శి

దళిత మహిళలపై పెత్తం దారులు దాడి చేయడం అమానుషమని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి తెలిపారు. దర్శి మండలం బొట్ల పాలెంలో పెత్తం దారుల దాడిలో గాయపడిన దళిత మహిళలు అనూరాధ, మౌనిక కుటుంబాలను ఆదివారం ఐద్వా బృందం పరామర్శించింది. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు అయినా ఇంకా పెత్తనదారితనం, కులవివక్ష కొన సాగుతుందన్నారు. కులరక్షసి, కులతత్వం ఎంతో అమానుషమన్నారు. ఈ కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారించి నిదితులను కఠినంగా శిక్షించాలన్నారు. బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా ప్రకాశం జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, జిల్లా అధ్యక్షురాలు సయ్యద్ షమ్మీ, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కెవి. పిచ్చయ్య, దళిత నాయకులు ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

బాధిత మహిళతో మాట్లాడుతున్న రమాదేవి

ముస్లింల అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..?

- ఎమ్మెల్యే బాలినేనికి మాజీ ఎమ్మెల్యే దామచర్ల సవాల్
- టిడ్కో రుణాల విషయంలో రాజకీయాలు తగవని వ్యాఖ్య

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

ఎవరి పాలనలో ముస్లింల సంక్షేమం, అభివృద్ధి జరిగిందో మత పెద్దల సమక్షంలో చర్చకు సిద్ధమా..? అని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ సవాల్ విసిరారు. ముస్లింల ఆత్మీయ సమ్మేళనం స్థానిక ఇస్లాంపేటలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ ఐదుసార్లు ఎమ్మెల్యేగా, రెండు సార్లు మంత్రిగా పనిచేసిన బాలినేని శ్రీనివాసరెడ్డి ముస్లింలకు చేసిన అభివృద్ధి ఏంటో...? తాను ఐదేళ్లు ఎమ్మెల్యేగా ఉండి ముస్లింల సంక్షేమం, అభివృద్ధికి చేసిన కార్యక్రమాలు ఏంటో మత పెద్దల సమక్షంలో చర్చకు రావాలని సవాల్ చేశారు. ఇస్లాంపేట కమ్యూనిటీ హాలులో సమావేశం నిర్వహించక హూడదని బాలినేని తనయుడు హుకుం జారీ చేసినప్పటికీ ఎలాంటి బెదిరింపులకు భయడకుండా ముస్లింలు పెద్ద సంఖ్యలో ఆత్మీయ సమ్మేళనానికి తాను రావడం ఆనందంగా ఉందన్నారు. ఒంగోలు నగరంలో టిడ్కో ఇళ్లు రద్దు చేసిన వారికి రుణాలు తిరిగి ఇచ్చే విషయంలో రాజకీయాలు చేయడం సబబు కాదన్నారు. స్థానిక ఎమ్మెల్యే సంతకం ఉంటేనే డబ్బులు తిరిగి ఇస్తామని అధికారులు చెప్పడాన్ని తప్పుపట్టారు. డబ్బులు కోసం ముందుగా దరఖాస్తు చేసుకున్న వారికి ప్రాధాన్యత క్రమంలో ఇవ్వాల న్నారు. టిడ్కోకు ప్రజలు చెల్లించిన డబ్బులన్నీ తిరిగి తెచ్చి ఇళ్లు రద్దు చేసిన వారందరికీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా 300మంది ముస్లింలు వైసిపిని వీడి దామచర్ల జనార్ధన్ సమక్షంలో టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో మౌలానా అబీద్, మాజీ మున్సిపల్ చైర్మన్ మంత్రి శ్రీనివాసరావు, ఒంగోలు ఎఎంసి మాజీ చైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు, నగర టిడిపి అధ్యక్షుడు కొటారి నాగేశ్వరరావు, షేక్ కఫిల్ బాషా, షేక్ కరిముల్లా, షేక్ రఫి, షేక్ రసూల్, షేక్ అజిమున్నీషా, షేక్ అజీష్, షేక్ అల్లాభక్షు, షేక్ సిలార్, షేక్ ముల్లా, మదార్‌బాషా, మతిన్, జాకీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దామచర్ల

మెరుగైన 'ఆరోగ్యశ్రీ' సేవలే లక్ష్యం

- 128 నెట్‌వర్క్ హాస్పిటల్స్ ద్వారా 1.47 లక్షల సర్జరీలు
- ఆసరాలో 78,504 మందికి లబ్ధి
- వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ వి.శ్రావణ్ కుమార్

ముఖాముఖి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలోని ప్రజలకు డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీలో మెరుగైన వైద్య సేవలు అందించటమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త డాక్టర్ వి.శ్రావణ్ కుమార్ తెలిపారు. జిల్లాలోని 128 ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్స్ ద్వారా ప్రజలకు కార్పొరేట్ వైద్య సేవలను అందిస్తున్నామన్నారు. గత ఐదేళ్ల కాలంలో 1,47,366 మందికి రూ.3.73 కోట్లతో వివిధ సర్జరీలు చేశామన్నారు. వివిధ నియోజకవర్గాలలో వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ వైద్య శిబిరాలు నిర్వహించి రోగులను పరీక్షించి శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని నెట్‌వర్క్ ఆసుపత్రులకు తరలిస్తున్నామన్నారు. నెట్‌వర్క్ హాస్పిటల్స్‌లో ఆరోగ్యశ్రీ పథకంలో చికిత్స పొందే రోగులనుంచి ఎవరైనా డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకంలో అందిస్తున్న సేవలను జిల్లా సమన్వయకర్త ప్రజాశక్తికి వివరించారు. అవన్నీ ఆయన మాటలల్లోనే....

రాష్ట్ర ప్రభుత్వం, వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లాలో డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకంలో ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నాం. 2007లో వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు 3,63,572 ఆరోగ్యశ్రీ సర్జరీలు, మెడికల్ ప్రొసీజర్స్ చేశారు. అందుకు 1093.13 కోట్లు ఖర్చు చేశాం. జిల్లాలో 128 నెట్‌వర్క్ హాస్పిటల్స్ ద్వారా ప్రజలకు శస్త్ర చికిత్సలు, వైద్య సేవలు అందిస్తున్నాం. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మొత్తం 142 మంది ఆరోగ్య మిత్రలు ఉన్నారు. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో ప్రకాశం జిల్లాలో 102 మంది, బాపట్ల జిల్లాలో 19, నెల్లూరు జిల్లాలో 8 మంది ఆరోగ్య మిత్రలు ఉన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 10 ఆరోగ్య మిత్ర పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆరోగ్య మిత్రలను పర్యవేక్షించేందుకు ప్రకాశం జిల్లాలో 9 మంది టీమ్ లీడర్లు పనిచేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈనెల 7 వరకు 574 వైద్య శిబిరాలు నిర్వహించాం. ఆయా వైద్య శిబిరాలు 1,31,025 మంది రోగులను పరీక్షించారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 78,504 మంది లబ్ధి పొందారు. ఇందుకు రూ.48.66 కోట్లు మంజూరైంది. కొత్త ప్రకాశం జిల్లాలో 52 హెల్ప్ డెస్కుల ద్వారా ప్రజలకు సరైన సమాచారం అందిస్తున్నారు. జిల్లాలోని 86 ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్స్ సిసి కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నాం. జిల్లాలో 9.53,701 మందికి ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేశాం. 66,351 మంది ఎంప్లాయీస్ స్మార్ట్ కార్డులు పంపిణీ చేశాం. ఇహెచ్ఎస్ పెన్షనర్లు 19,394 మందికి స్మార్ట్ కార్డులు అందజేశాం.

128 నెట్‌వర్క్ హాస్పిటల్స్ ద్వారా వైద్యసేవలు

జిల్లాలో 128 నెట్‌వర్క్ హాస్పిటల్స్ ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నాం. ఆరోగ్య ప్రభుత్వ నెట్‌వర్క్ హాస్పిటల్స్ 13 ఉన్నాయి. ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల, మాతా శిశు వైద్యశాల, జిల్లా వైద్యశాల, 2 ఏరియా ఆసుపత్రులు, 8 సిహెచ్‌సిలు ఉన్నాయి. 64 ఆరోగ్యశ్రీ ఎంప్యానల్డ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 39 ఆరోగ్యశ్రీ కార్పొరేట్ నెట్‌వర్క్ హాస్పిటల్స్, 12 ఇహెచ్ఎస్ డెంటల్ హాస్పిటల్స్ ద్వారా వైద్యసేవలు అందిస్తున్నాం.

1.47 లక్షల సర్జరీలు

జిల్లాలో ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్స్ ద్వారా 1,47, 356 సర్జరీలు చేయటం ద్వారా రూ.372.81 కోట్లు ఖర్చు చేశాం. 2019-20ల 30,985 సర్జరీలకు రూ.8.87కోట్లు, 2020-21లో 30,726 సర్జరీలకు రూ.80.02 కోట్లు, 2021-2022లో 45,680 సర్జరీలకు రూ.110.17 కోట్లు, 2022-23 సంవత్సరంలో 39,975 సర్జరీలకు రూ.103.15 కోట్లు, 2023-24 సంవత్సరంలో 39,975 సర్జరీలకు రూ.37.78 కోట్లు ఖర్చు చేశాం.

వైఎస్ఆర్ ఆసరాలో 78,504 మందికి లబ్ధి

వైఎస్ఆర్ ఆసరా ద్వారా 78,504 మంది లబ్ధిదారులకు రూ.48.66 కోట్లు లబ్ధి చేకూరింది. 2019-20లో 4,574 లబ్ధిదారులకు రూ.3.43 కోట్లు, 2020-21లో 12,535 లబ్ధిదారులకు రూ.9.22 కోట్లు, 2021-2022లో 20,535 లబ్ధిదారులకు రూ.12.63 కోట్లు, 2022-23 సంవత్సరంలో 30,286 లబ్ధిదారులకు రూ.17.96 కోట్లు, 2023-24 సంవత్సరంలో 10,574 లబ్ధిదారులకు రూ.5.42 కోట్లు లబ్ధి చేకూరింది. రానున్న కాలంలో ప్రజలకు మరిన్ని వైద్య సేవలు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-చీమకుర్తి

ఐదవ రాష్ట్రస్థాయి కరాటే, కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం స్థానిక బూచేపల్లి కల్యాణమండపంలో ప్రారంభమయ్యాయి. తథాగత్ భోధిధర్మ షిటోరియా ఇంటర్నేషనల్ సంస్థ నిర్మాహకులు డి వెంకటేష్, డి సుధాకర్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. పోటీలను చీమకుర్తి లయన్స్‌క్లబ్ అధ్యక్షులు చలువాది బదరీ నారాయణ, జడ్‌పిటిసి వేమా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు సాయి, వివిధ రాష్ట్రాలకు చెందిన కరాటే కుంగ్‌ఫూ శిక్షకులు పాల్గొన్నారు.